హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 । కనిష్ఠం 24.0



మిల్‌పాయింట్ వద్ద నిలిచిన ధాన్యం ట్రాక్టర్లు

సారూ... మద్దతు ఇప్పించరూ!

ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. సన్నధాన్యంలో ప్రధానంగా పండించిన కావేరి చింట్లు రూ.2,100కు, మహీంద్ర చింట్లు, హెచ్ఎంటీ రకాల ధాన్యం తక్కువకే కొనుగోలు చేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. మిల్లరు ధాన్యానికి మద్దతు ధరకు కొనుగోలు చేసేలా పర్యవేక్షించేందుకు మిల్లు పాయింట్ల వద్ద రెవెన్యూ అధికారులను ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

» క్వింటా రూ.2050కే కొనుగోలు » రెండు రోజులుగా ధర తగ్గించిన మిల్లర్లు » మిర్యాలగూడ మిల్లర్ల తీరుపై రైతుల గగ్గోలు » శెట్టిపాలెం మిల్లుల వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు

ఒక్కో ట్రాక్టర్ లోడుకు ఒక్కో ధర చొప్పున మిల్లర్లు కొనుగోలు చేస్తుండడంతో తమ ధాన్యానికి ఎంత ధర పెడతారోనని ఆందోళనతో మిల్లుల ఎదుట రైతులు పడిగాపులు కాస్తున్నారు. రాత్రికే మిల్లులకు చేరినప్పటికీ సాయంత్రం వరకు కొనుగోలు చేయడంలేదంటున్నారు. పట్టణంలో మిల్లుల వద్ద వందల సంఖ్యలో ధాన్యపు ట్రాక్టర్లు బారులు తీరుతుండగా మిల్లర్లు తమకు తోచిన ధరకు కొనుగోలు చేస్తునారని అంటున్నారు. రైస్ మిల్లర్లు రైతులను నిలువునా దోపిడి చేస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

క్వింటాకు రూ.2050కే కొనుగోలు

సిండికేట్‌గా మారిన మిల్లర్లు ధరలో తీవ్రంగా కోత విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గత రెండు రోజులక్రితం వరకు క్వింటాకు రూ.2300 నుంచి రూ.2,350 వరకు కొనుగోలు చేసిన మిల్లర్లు అకాల వర్షాల వార్తలతో రూ.200-300 వరకు ధర తగ్గించి సన్నధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కొన్నిరకాల ధాన్యాన్ని మిల్లర్లు రూ.2000 నుంచి రూ.2100కే కొనుగోలు చేస్తూ రైతును ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సాధారణ చింట్ల రకాలను సైతం రూ.2220 నుంచి రూ.2230 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, కనీస మద్దతు ధర కూడా రైతులకు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహీంద్ర చింట్ల రకాన్ని రూ.2100 నుంచి రూ.2150 వరకు కొనుగోలు చేయగా హెచ్ఎంటీ ధాన్యాన్ని క్వింటాకు రూ.2000కే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. గత సీజన్‌లో చింట్ల రకాలకంటే హెచ్ఎంటీ రకాన్ని రూ.50 తక్కువకు మాత్రమే కొనుగోలు చేయగా, ఈసారి రూ.300 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

మద్దతు ధరపై కొరవడిన పర్యవేక్షణ

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మద్దతు ధరకు కొనుగోలు చేయని మిల్లుల వద్ద గురువారం రెవెన్యూ సిబ్బందిని నియమించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ మిల్లర్లు తక్కువ ధరకే కొనుగోలు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధరకంటే మిల్లర్లు తక్కువకు కొనుగోలు చేస్తున్నప్పటికీ అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర ప్రకటించినా రూ.2000 నుంచి రూ.2200 వరకు మాత్రం కొనుగోలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిండికేట్‌గా మారిన మిల్లర్లు అధికారుల ఆదేశాలు లెక్కచేయడం లేదంటున్నారు. ధాన్యం నాణ్యతను మిల్లర్లే నిర్ధారించడంవల్ల రైతు ధాన్యాన్ని శాస్త్రీయంగా పరీక్షించి నాణ్యతను నిర్ధారించే అధికారులు అందుబాటులో లేనందున, మిల్లర్లను బతిలాడి విక్రయించాల్సి వస్తుందని అంటున్నారు.

వే బిల్లుపైనే ధాన్యం రేటు

రైతులు మిల్లర్లకు ధాన్యం విక్రయించినప్పటికీ మిల్లు పేరున కాకుండా వేబ్రిడ్జ్ పేరున రశీదులు జారీ చేస్తున్నారు. వేబ్రిడ్జి తూకం బిల్లుపైనే మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసిన

- మిగతా 6వ పేజీలో...



మదర్‌డెయిరీలో అవిశ్వాస సెగ

» ప్రస్తుత చైర్మన్‌ను తొలగించాలనే యోచన » స్థానిక ఎమ్మెల్యేలకు పరేషాన్

యాదాద్రి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (మదర్‌డెయిరీ) రాజకీయాలకు వేదికగా మా రింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పార్టీ నుంచి ఎన్నికైన చైర్మన్‌పై ఆరునెలలకే అవిశ్వాసానికి తెరదింపడం చర్చనీయాంశం గా మారింది. సొంత పార్టీకి చెందిన డైరెక్టర్లే ప్రస్తుతం ఉన్న చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. రెండురోజుల క్రితం 11 మంది డైరెక్టర్లు రహస్యంగా సమావేశమై, అవిశ్వాసంపై చర్చించా రు. వీరిలో తొమ్మిది మంది కాంగ్రెస్‌కు చెందిన వారు కాగా,ఇద్దరు బీఆర్ఎస్ డైరెక్టర్లు ఉన్నారు. అవిశ్వాస అంశంపై ఉమ్మడి నల్లగొండతోపాటు రంగారెడ్డి జిల్లాలోని కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత ఆరునెలలుగా పాల బిల్లులు చెల్లించకపోవడంతోపాటు ఉద్యోగులకు సరిగ్గా జీతభత్యాలు ఇవ్వడంలేదని చైర్మన్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. మదర్ డెయిరీలో మొత్తం 15 మంది డైరెక్టర్లకు మెజార్టీ సభ్యులు ఆలేరు నియోజకవర్గానికి చెందిన వారే ఉన్నారు. అయితే ఈ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యేలను పరేషాన్‌కు గురిచేస్తుంది. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పట్టుబట్టి ప్రస్తుతం ఉన్న చైర్మన్‌కు మద్దతు తెలిపారు. అయితే ఆరు నెలలు కాకముందే చైర్మన్‌పై విమర్శలు వ్యక్తం కావడంతోపాటు అవిశ్వాసం వరకు వెళ్లడంతో ఈ వ్యవహారం..

- మిగతా 5వ పేజీలో..

మదర్ డెయిరీ చైర్మన్‌ను మార్చే ప్రసక్తేలేదు : డైరెక్టర్లు 5



గురుకులాల్లో... కోడింగ్ క్లాసులు

» 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు శిక్షణా తరగతులు
» ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి అమలు
» ఏఐ, మెషిన్ లెర్నింగ్, రోబొటిక్స్, ఆన్‌లైన్ టూల్స్‌పై క్లాసులు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గురుకులాల్లో ఇక నుంచి సాంకేతిక విద్య కూడా అందించనున్నారు. మెరుగైన విద్యతో పాటు పోటీ ప్రపంచంలో సాంకేతికతలో వస్తున్న మార్పులు అందించాలనే తలంపుతో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్(తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సొసైటీ) కోడింగ్ క్లాసులకు సిద్ధమైంది. ఈ విద్యా సంవత్సరం(2025-26) నుంచే అందించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు తగ్గట్లు సౌకర్యాలు కల్పించనున్నట్లు గురుకుల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-కోదాడ)

ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు రెగ్యులర్ తరగతులతో పాటు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఫలితంగా విద్యార్థులు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకుంటూ ఆయా రంగాల్లో రాణిస్తారని భావిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 17,920 మంది విద్యార్థులు కోడింగ్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోనున్నారు. ప్రాథమికోన్నత స్థాయి నుంచి విద్యార్థులకు కోడింగ్ క్లాసులు నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో 28 గురుకులాలు..

ఐదవ జోన్‌లోని ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు జనగాం జిల్లాలోని 28ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 640 మంది విద్యార్థుల చొప్పున 17,920మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం కోడింగ్ క్లాసులు అందించాలనే నిర్ణయంతో వారందరూ సాంకేతిక విద్యను అందిపుచ్చుకోనున్నారు.

కోడింగ్ అర్థం..

కంప్యూటర్‌గానీ,స్మార్ట్‌ఫోన్‌గానీ వాడుతున్నప్పుడు మనకు తెరపై కనిపించే అప్లికేషన్లు నడిపించేందుకు వెనక చాలా ప్రోగ్రామ్‌లు పనిచేస్తుంటాయి. ఆయా ప్రోగ్రామ్‌లను కంప్యూటర్ ప్రోగ్రామింగ్ భాషలో రాస్తారు.ఇలా రాయడాన్ని కోడింగ్‌అంటారు.ఈ కోడింగ్ ద్వారానే అప్లికేషన్లు, వెబ్‌సైట్లు, సాఫ్ట్‌వేర్ రూపొందివచ్చు. పైథాన్,జావా, హెచ్‌టీఎంఎల్‌వంటి కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లు ఈకోవకు చెందినవేనని నిపుణులు చెబుతున్నారు.

పాఠ్యాంశాలతో పాటు శిక్షణ ..

పోటీ ప్రపంచంలో చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధి(స్కిల్ డెవలప్‌మెంట్) అనేది ప్రస్తుతం కీలకంగా మారింది. కాగా ప్రభుత్వం ప్రస్తుతం తరగతి గదిలో కరిక్యులమ్(పాఠ్యప్రణాళిక), యాక్షన్‌ప్లాన్(కార్యాచరణ ప్రణాళిక), మానిటరింగ్(పర్యవేక్షణ), పెడగోజీ(బోధన)నను

- మిగతా 5వ పేజీలో...

సాంకేతిక మెళకువలు నేర్పటం అభినందనీయం



ఆరో తరగతి నుంచే విద్యార్థులకుసాంకేతిక మెళకువలు నేర్పించాలనే ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. సాధారణంగా గురుకులాల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉంటారు. వారికి ఫోన్లు, కంప్యూటర్‌పై అవగాహన ఉండదు. ప్రభుత్వ నిర్ణయంతో పాఠశాలలోనే సాంకేతికతపై అవగాహన సంపాదించి బయటకు వెళ్తా రు. విద్యార్థులు ఏరంగంలో రాణించాలన్నా ఇప్పుడు స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రధానంగా అ వసరం.అది పాఠశాల స్థాయిలోనే సాధిస్తారు. దీంతో పోటీప్రపంచలో సులభంగా రాణిస్తారు.

- దున్నా వెంకటేశ్వర్లు, గురుకుల ఉపాధ్యాయుడు

జిల్లాలో 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కలెక్టర్ ఇలాత్రిపాఠి



చిట్యాల మండలం వెలిమినేడులో మహిళా రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. మండలంలోని పెద్దకాపర్తి, వెలిమినేడులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డీసీవో పత్యానాయక్‌లతో కలిసి బుధవారం ప్రారంభించారు. గ్రామాల్లో సన్న ధాన్యం సాగు చేసేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించడంతో రైతులు కూడా సన్నధాన్యాన్ని సాగుచేశారన్నారు. బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు ద్వారా నీరందించడంలో సాగువిస్తీర్ణం పెరిగిందన్నారు. సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. ధాన్యం శుద్ధి చేసేందుకు ఆటోమేటిక్ ధాన్యం శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేశామని, వాటితో రైతులకు ధాన్యం శుద్ధిలో ఇబ్బందులు ఉండవాన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేస్తుందని, వ్యవసాయాన్ని పండుగలా చేసేందుకు పోత్సహిస్తుందన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

నిడమనూరు: గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, ఓపీ, ఏఎన్‌సీ రిజిస్టర్, హైరిస్క్ చార్టుల ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పెచ్చులు ఊడుతున్న భవనాన్ని పరిశీలించడంతో పాటు నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలించారు. ఈనెలాఖరులోగా నిర్మాణ పనులుపూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంత రం తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా తనిఖీ చేసి రేషన్‌కార్డులకు వచ్చిన దరఖాస్తులు, ధరణి పెం డింగ్ సమస్యల గురించి అడిగితెలుసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించి విచారణ పూర్తిచేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, వైద్యాధికారులు అరవింద్, డాక్టర్ రఫీ, ఆర్ఐలు సందీప్, దాడి రాజిరెడ్డి, జలీల్ పాషా, గంటా సోమయ్య, అనిల్ ఉన్నారు.

రాజీవ్‌యువ వికాసం దరఖాస్తుకు 14 వరకు గడువు

నల్లగొండ టౌన్: రాజీవ్ యువ వికాసం పథకానికి ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ పథకం కింద వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలకు 21 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయేతర పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు 21నుంచి 55 సంవత్సరాల వరకు వయస్సున్నవారు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షా 50వేలు వార్షిక ఆదాయం, మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రూ. లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారు ఈ పథకానికి అర్హులన్నారు. మొదటిసారి ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి, మహిళలు, దివ్యాంగులు, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారు, ఎస్సీ ఎస్టీ ఉపకులాల వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

రాఘవరెడ్డి స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలి

- సీపీఎం జిల్లా నేతలు ఐలయ్య, నాగార్జున



జిల్లాకేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో రాఘవరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్, కట్టంగూరు, కేతేపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాల రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. జిల్లాలోని కట్టంగూరు, కేతేపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాల మండలంతోపాటు జిల్లాకేంద్రంలోని స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో నకిరేకల్ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో పుచ్చకాలయల నర్సిరెడ్డి, సీపీఎం నాయకులు సీపీఎం జిల్లా నాయకులు బండా శ్రీశైలం, గంజి మురళీధర్, ఎండీ సలీం, ఊట్కూరు నారాయణరెడ్డి, దండంపల్లి సత్తయ్య, నలుపరాజు సైదులు, అనురాధ, తుమ్మల పద్మ పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి

- సామాన్యులపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం
- ధర తగ్గించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- జిల్లావ్యాప్తంగా నిరసనలు

6

బుద్ధవనం ముస్తాబు

మే 12న మిస్‌వరల్డ్ పోటీదారుల బస

నేడు పనులు పరిశీలించనున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



బుద్ధవనంలో రంగులు వేసిన కాటేజీ

నాగార్జునసాగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మే 7 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న ప్రపంచ సుందరీమణులు మే నెల 12వ తేదీన అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో బస చేయనున్నారు. బుద్ధపూర్ణిమ రోజువస్తున్న వారి కోసం బుద్ధవనాన్ని ముస్తాబు చేస్తున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీల్లో 140 దేశాలకు చెందిన యువతులు పాల్గొననున్నారు. అందులో ఆసియా దేశాలకు చెందిన 30మంది యువతులు ఉన్నారు. వీరు తెలంగాణ రాష్ట్రం లో ఉన్న పర్యాటక ప్రాంతాల సందర్శనలో భాగంగా మే 12వ తేది బుద్ధపూర్ణిమ రోజున సాగర్‌లో ఉన్న బుద్ధవనం, నాగార్జునకొండను సందర్శించ నున్నారు. బుద్ధవ నంలో రాత్రి బస చేస్తారని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. బుద్ధవనంలో ఉన్న ఆరు కాటేజీలను మరమ్మతులు చేయడానికి పర్యాటకశాఖ రూ.42 లక్షలు కేటాయించింది. దీంతో కాటేజీలకు నూతనంగా రంగులు వేసి కొత్త డోర్లు, ఏసీలు అమరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. బుద్ధవనం లోపల ఉన్న అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, ఎండిన గడ్డి, పిచ్చి మొక్కలను శుభ్రం చేయిస్తున్నారు. 15రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. పనులను పరిశీలించడానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సాగర్‌కు రానున్నారు.



దేవరకొండలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్, పార్టీ నాయకులు

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

దేవరకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు బుధవారం దేవరకొండలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. అనంతరం ఏఐసీసీ సభ్యుడు సంజీవ్ ముదిరాజ్‌తో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మామిడికాయకు
ధరల కోత

● వ్యాపారులు సిండికేట్ ● పట్టించుకోని అధికారులు



భానుపురి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మామిడి సాగు చేసిన రైతులను మండీ వ్యాపారులు ధరల కోతలు విధించి నడ్డివిరుస్తున్నారు. సిండికేట్‌గా మారి ధరలను తగ్గిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే డిమాండ్ లేదని సాకు చెబుతూ దోచుకుంటున్నారు. ఇతరరాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు ధరలను తగ్గిస్తున్నా అడిగే నాథుడే కరువయ్యారు. రెండు రోజుల కిందటే మార్కెట్ ప్రారంభమైన మార్కెట్‌కు ఇబ్బడిముబ్బడిగా దిగుబడి వస్తోంది. వివిధ సాకులతో వ్యాపారులు ధరలను కోత విధిస్తున్నారు. అయినా ధరలపై వ్యాపారుల నియంత్రణపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. మార్కెట్ ఫీజు వస్తుందని గుట్టుచప్పుడు కాకుండా ఉంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. 99శాతం మామిడి తోటలను కౌలుకు తీసుకుని రైతులు సాగు చేస్తున్నారు. తోట యజమానికి కౌలు, పూత దశ నుంచి కాతదశ వచ్చే వరకు మందులను పిచికారీచేయడం, కోతుల భారీ నుంచి, ఈదురు గాలుల నుంచి తప్పించుకుని మామిడి పంటను మార్కెట్లకు తీసుకువస్తే వ్యాపారులు సిండికేట్ అవుతున్నారు. ఈదురుగాలులు వస్తే చాలు వ్యాపారులు అమాంతంగా ధరలను తగ్గిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్‌రోడ్డులో మామిడికాయల మండీలు 9 నుంచి 12 వరకు ఉన్నాయి. వీటిపై అధికారుల పర్యవేక్షణ కరువైంది.

ఒక్క రోజులో రూ.19 వేలు కోత

కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన రైతు బాలబోయిన సత్యనారాయణ స్థానికంగా ఉన్న మామిడితోటలోని 13.20 ఎకరాలను కౌలుకు తీసుకున్నారు. పంటను కాపాడుకోవడానికి నానాకష్టాలు పడ్డారు. తోటకు రూ.9 లక్షలు కౌలు చెల్లించాల్సి ఉండగా, వివిధ రకాల పిచికారీ మందులకు రూ.5 లక్షలు ఖర్చు చేశాడు. పూత దశ నుంచి పంట చేతికందే వరకు ఏడుసార్లు మందులను పిచికారీ చేశాడు. పూత దశలో, ఆ తర్వాత నూక పడిపోకుండా, బటానీ గింజ, శనగ గింజ, నిమ్మకాయ సైజు వచ్చే వరకు, మంచు కురిసిన సమయంలో, కాయలపై మంగు రాకుండా మందులను పిచికారీ చేశాడు.

సూర్యాపేటలో మార్కెట్‌లో కొనుగోళ్లు మంగళవారం ప్రారంభమైందని తెలిసి 2 టన్నుల మామిడికాయలు తీసుకువచ్చారు. కాగా టన్నుకు రూ.59 వేల ధర పలికింది. ధర మంచిగా వస్తుందన్న ఆశతో బుధవారం మరో టన్నున్నర పంటను తీసుకువచ్చాడు. కానీ ఈసారి వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ.38 వేలకే పాట పడ్డారు. ఇదేం అన్యాయమని ప్రశ్నించిన సత్యనారాయణను దబాయించారు. ఈ క్రమంలో కమీషన్ ఏజెంట్ కల్పించుకుని మరో రూ.2 వేల ధర పెంచి రూ.40 వేలకు పాడించాడు. దీంతో ఒక్కరోజు తేడాలో రూ.19 వేల ధర వ్యాపారులు కోత విధించారు. ఈదురుగాలులకు పడిపోయిన కాయ తెచ్చారని సాకు చెప్పడం వ్యాపారులకు, కమీషన్‌దారులకు పరిపాటైంది. దీనికి తోడు హమాలీ ఖర్చు, గుమస్తాల మాములు, కమీషన్, మార్కెట్‌ఫీజు పేరుతో స్లిప్‌లను ఇస్తున్నారు. రూ.100కు రూ.14 చొప్పున కటింగ్ చేసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

మంగు లేని కాయ తెచ్చా



మంగు లేని, దెబ్బతినని కాయ తీసుకు వస్తే రూ.38 వేల ధర వేశారు. ఈదురుగాలులకు కింద పడిన కాయ తెచ్చినట్లు వ్యాపారులు సాకు చెబుతూ ధరలో కోత విధిస్తున్నారు. ఒక్క రోజు తేడాతోనే రూ.19 వేలు కోత విధించారు.

● బాలబోయిన సత్యనారాయణ, కౌలు రైతు

నిఘా పెడతాం

మామిడి మండీలపై నిఘా పెడతాం. పర్యవేక్షణ కోసం మార్కెట్ సిబ్బందిని కేటాయించాం. ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గినప్పుడు ఇక్కడ ధర తగ్గిస్తారు. కాయ బాగుంటే మంచి ధర ఇస్తారు.

సంతోష్‌కుమార్, సూర్యాపేట, మార్కెట్‌కార్యదర్శి

ట్రాన్స్‌కో సేవలు స్మార్ట్‌గా...

» కొత్త కనెక్షన్ నుంచి ఫిర్యాదుల వరకు
» టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌ను ఆధునికీకరించిన సంస్థ
» పలు ఫీచర్లతో 20 రకాల సేవలు

ఇంటి నుంచి కాలు కదపకుండా స్మార్ట్‌ఫోన్ ద్వారానే సేవలు పొందేలా ట్రాన్స్‌కో తన యాప్‌ను ఆధునికీకరించింది. కొత్త కనెక్షన్ నుంచి ఫిర్యాదుల దాకా అన్ని స్మార్ట్‌ఫోన్ ద్వారా పొందేలా టీజీఎస్‌పీడీసీఎల్ యాప్ రూపుదిద్దారు. వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సంస్థ విరివిగా వినియోగించుకుంటోంది. సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ స్వీయ పర్యవేక్షణలో అప్డేటెడ్ వెర్షన్‌లో ఈ యాప్‌ను విస్తృతంగా వాడుకలోకి తీసుకువచ్చారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ టౌన్)

వినియోగదారులకు పలు సేవలందించేందుకు 2024లో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్‌పీడీసీఎల్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే అందులో సేవలు పరిమితం కావడం,తరుచూ బిల్లుల చెల్లింపులపై ఆంక్షలు విధిస్తుండటంతో వినియోగదారులు యాప్‌ను వినియోగించలేదు. మారుతున్న కాలానికనుగుణంగా యాప్‌ను సంస్థ ఆధునికీకరించింది. సుమారు 20 రకాల సేవలను టీజీఎస్‌పీడీసీఎల్ యాప్ ద్వారా అందుబాటులోకి తెచ్చారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి టీజీఎస్‌పీడీసీఎల్ యాప్ అని డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత యూఎస్సీ(యూనిక్ నెంబరు ఇన్ ఎలక్ట్రిసిటీ) నంబరు నమోదు చేయడం ద్వారా అన్నిరకాల సేవలను పొందేలా దీన్ని రూపొందించారు.

యాప్ నుంచే ఫిర్యాదులు...

విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తినా ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లు సమాచారం ఉంటే సంబంధిత అధికారులకు యాప్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంది. విద్యుత్ చార్జీలకు సంబంధించిన టారీఫ్ వివరాలు, భద్రతకు సంబంధించిన సూచనలను ఈ యాప్ నుంచే సులభంగా




పొందేలా ఆధునికీకరించారు. సంస్థ పరిధిలో దాదాపు 10లక్షల మంది వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగిస్తున్నారని అధికారులు తెలిపారు. మొత్తంగా అరచేతిలోనే విద్యుత్ రంగ సమగ్ర సమాచారం, సేవలను పొందేలా ఈ యాప్‌ను రూపొందించారు. స్మార్ట్‌ఫోన్ యాప్‌తో పాటు వెబ్‌సైట్‌లలోనూ ఆన్‌లైన్ సేవలను సులభంగా పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

జీపీఎస్ విధానం ద్వారా...

విద్యుత్ శాఖకు సంబంధించి ఎక్కడ ఏదైనా ఘటన జరిగినా యాప్‌లోని జీపీఎస్ లోకేషన్ ద్వారా వినియోగదారుడు ఫోన్లో ఫొటో తీసి పంపవచ్చు. దీంతో ఇందుకు సంబంధించిన రిపోర్టు నేరుగా సంబంధిత అధికారికి చేరుతుంది. వారు స్పందించి పరిష్కరిస్తారు.

యాప్ సేవలను వినియోగించుకోవాలి



టీజీఎస్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం పలు ఫీచర్లతో కూడిన యాప్‌ను అభివృద్ధి చేసింది. దీని ద్వారా వినియోగదారులకు పలు సేవలు అందుతాయి. విద్యుత్ సమస్యలు, బిల్లుల చెల్లింపులు, కొత్ కనెక్షన్లు, అధికారుల కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగే అవసరం లేకుండా యాప్‌ద్వారా సేవలను వినియోగించుకోవచ్చు.

- వేణుగోపాలాచార్యులు,ఏడీఈ,నల్లగొండ.

న్యూ కనెక్షన్

విద్యుత్‌కనెక్షన్ కావాలనుకునే వారు ఎలా దరఖాస్తు చేసుకోవాలనే వివరాలు ఇందులో ఉంటాయి.

» పేరు, లోడ్ మార్పు : విద్యుత్ మీటర్ పేరు మార్చడానికి ఏంచేయాలనే వివరాలు, లోడ్ వివరాలు ఉంటాయి. దీని ప్రకారం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.
» పవర్ కంజెప్షన్ గైడ్‌లైన్స్ : విద్యుత్ ఉపకరణాలు, ఆ అవసరానికి ఎంత విద్యుత్ వినియోగం అవుతుందనే వివరాలు ఉంటాయి.
» టారీఫ్ వివరాలు: విద్యుత్ వినియోగ చార్జీలు కేటగిరీల వారీగా ఉంటాయి.
» ఎనర్జీ సేవింగ్ టిప్స్:విద్యుత్ పొదుపు చేయడానికి తీసుకోవాల్సిన సూచనలు ఉంటాయి.
» సేఫ్టీ టిప్స్ : విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉంటాయి.
» ఫీడ్ బ్యాక్ : సంస్థ అందిస్తున్న సేవల గురించి వినియోగదారులు తమ అభిప్రాయాలు తెలపవచ్చు.
» మై అకౌంట్ : విద్యుత్ వినియోగదారుల పూర్తి వివరాలు ఇందులో ఉంటాయి.
» కాంటాక్ట్ యాజ్ : ఇందులో 24 గంటలు పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు ఉంటాయి. 1912, సమస్యలను తెలియజేయవచ్చు. వీటితో పాటు వినియోగదారుల పరిధిలోని అధికారుల వివరాలు, బిల్లులకు సంబంధించిన సమాచారం వివరాలను యాప్‌లో తెలుసుకోవచ్చని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వినియోగదారుడు తన సమస్యలను నేరుగా ఇందులో తెలియజేయవచ్చు. మీటరు నంబరు, సమస్యల వివరాలు నమోదు చేస్తే అధికారులు పరిష్కరిస్తారు. ఫిర్యాదు స్టేటస్‌ను చూసే అవకాశం ఉండగా, పరిష్కారం విషయంలో సంతృప్తి చెందకపోతే తిరిగి ఫిర్యాదు చేయవచ్చు

» సెల్ఫ్‌రీడింగ్: వినియోగదారులు తమ మీటరుకు సెల్ఫ్‌రీడింగ్ తీసుకుని పంపించవచ్చు. దీని ప్రకారం బిల్లులు జారీ అవుతాయి.
» పే బిల్స్ : సర్వీస్ నంబరు నమోదు చేసుకుని ప్రతినెలా తమ విద్యుత్ బిల్లులను ఇందులో చెల్లించవచ్చు.
» బిల్ హిస్టరీ : తాము ఇప్పటి వరకు చెల్లించిన బిల్లుల వివరాలను పొందవచ్చు.
» ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ : ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లుల వివరాలను చూసుకునే అవకాశం ఉంది.
» లింక్ ఆధార్, మొబైల్ : వినియోగదారులు తమ ఆధార్, మొబైల్ నంబర్లను లింక్ చేసుకోవచ్చు. దీంతో ప్రతినెలా బిల్లులకు సంబంధించిన సమాచారం మెసేజ్ వస్తుంది.
» డొమెస్టిక్ బిల్ క్యాలిక్యూలేటర్ : వినియోగాదారులు నెల వారి విద్యుత్ వినియోగానికి సంబంధించిన మీటర్ రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు వివరాలను చూసుకునే అవకాశం ఉంది.

రూ.1.18కోట్లతో ఊరచెరువుకు మరమ్మతు

చిట్యాలరూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్వగ్రామంలో ఊరచెరువుకు రూ. 1.18కోట్లతో మరమ్మతు పనులను చేపట్టామని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని ఊరచెరువుకు మరమ్మతు పనులను ఆయన బుధవారం ప్రారంభించి, మాట్లాడారు. చెరువులో నీటిసామర్థ్యం పెంపునకు మరమ్మతు పనులు ఉపయోగపడతాయన్నారు. దీంతో భూగర్భజలాల మట్టం కూడా పెరుగుతుందన్నారు. గ్రామాలకు చెరువులు ఎంతో ముఖ్యమని వాటి ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. చెరువులో నీటి లభ్యత అధికంగా ఉంటే భూగర్భజలాల మట్టం పెరిగి వ్యవసాయానికి సాగు నీరందుతుందని, రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుడిపాటి లక్ష్మీనర్సింహ, కోనేటి యాదగిరి, వనమా వెంకటేశ్వర్లు, చెరుకు సైదులు, పోలగోని స్వామి, పల్లపు బుద్ధుడు, జనార్ధన్, జన్నపాల శ్రీను, ఉయ్యాల నరేష్, బొడ్డు శ్రీను, మర్రి రమేష్, గుత్తా రవీందర్‌రెడ్డి, మర్రి శ్రీకాంత్, గోపాల్, శ్రీను, వెంకన్న, శంకర్, నర్సింహ, మల్లయ్య, యాదయ్య, నవీన్, నర్సింహ, రవి పాల్గొన్నారు.



చెరువు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి
15 నెలల జైలు శిక్ష

మిర్యాలగూడ లీగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో 15 నెలల జైలు శిక్ష విధిస్తూ మిర్యాలగూడ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బీఎస్ఎన్. సుమబాల బుధవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే..హాలియా మండలానికి చెందిన బండి లక్ష్మీనారాయణ 2014లో తన అవసరాల నిమిత్తం హాలియాకు చెందిన శాగం మణేమ్మ వద్ద రూ.23 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అనంతరం 2016 సంవత్సరంలో వడ్డీతో కలిసి రూ.33 లక్షల చెక్కు మణేమ్మకు ఇచ్చాడు.

సదరు చెక్కును మణెమ్మ బ్యాంకులో జమ చేయగా బౌన్స్ అయ్యింది. ఈ క్రమంలో మణేమ్మ కోర్టును ఆశ్రయించడంతో నేరం రుజువు కావడంతో లక్ష్మీనారాయణకు 15 నెలల జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.33 లక్షలు బాధితురాలికి చెల్లించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

వేములపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి అదే గ్రామానికి చెందిన ఉత్తెర్ల నరేష్ తన ట్రాక్టర్ లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండగా బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌తో పాటు నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు,
ఆరుగురికి జరిమానా

సూర్యాపేట క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టు ఓ వ్యక్తికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. ఈ నెల 8న సూర్యాపేటలోని పలుప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఏడుగురు మోతాదుకు మించి మద్యం తాగినట్లు తెలిపారు. వారిని బుధవారం కోర్టులో హాజరు పర్చగా సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ బీవీ రమణ ఒకరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1500 జరిమానా, మిగిలిన ఆరుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

కోర్టు ధిక్కరణ కేసులో అధికారులపై కేసు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని కోదాడ రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో అవుటర్ రోడ్డు నిర్మాణం సందర్భంగా ఇళ్ల నిర్మాణ తొలగింపులో కోర్టు ధిక్కరణకు పాల్పడిన పలు శాఖల అధికారులపె కేసు నమోదైనట్లు బాధితుడు వేలంగి రాజు తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైకోర్టు ఆర్డర్ ఉన్నా తన ఇంటిని కూల్చేశారని రాజు వెల్లడించారు. కాగా ఈ విషయంపై హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు ధిక్కరణ కింద కేసు నమోదు చేశారని తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

శాలిగౌరారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు మీద నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం నూలగడ్డ కొతపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాద్రాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన బండి యాదగిరి(55) నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం నారగూడెం గ్రామంలో మంగళవారం బంధువుల ఇంట్లో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై రాత్రి స్వగ్రామానికి బైక్ మీద వెళ్తున్నాడు. శాలిగౌరారం మండలం నూలగడ్డ కొత్తపల్లి గ్రామశివారులో గ్రామానికి చెందిన గజ్జి అంజయ్య తన పొలంలో వరికోత మిషన్‌తో పంట కోయిస్తున్నాడు. కోసిన ధాన్యాన్ని తీసుకెళ్లడానికి రోడ్డు మీద ట్రాక్టర్‌ను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా రోడ్డు మీద నిలిపాడు. అదే సమయంలో బైక్‌పై వస్తున్న యాదగిరి ట్రాక్టర్‌ను గమనించకుండా వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలై యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. యాదగిరికి భార్య, ఇద్దరకు కుమార్తెలు ఉన్నారు. పెద్దఅల్లుడు చిలుకూరి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.



యాదగిరి(ఫైల్)

కారు ఢీకొని మహిళ..

మోటకొండూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతున్న మహిళను వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కొండాపురంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుడ్డేటి నర్సమ్మ(60) రాయగిరి-మోత్కూరు ప్రధాన రోడ్డు వెంట ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతోంది. రాయగిరి నుంచి మోత్కూరు వైపు వెళ్తున్న కారు ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా ప్రమాదానికి కారణమై కారు నడుపుతున్న వ్యక్తి సంఘటన జరగగానే భయపడి కారు లాక్ చేసుకుని అక్కడి నుంచి పరారయ్యాడని స్థానికులు తెలిపారు.

పాతకక్షల నేపథ్యంలోనే హత్య

● హరిశ్చంద్ర కేసును ఛేదించిన పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ సంపత్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో కిడ్నాప్‌కు గురై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హత్యకు గురైన వ్యక్తి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. పాతగొడవలు మనసులో పెట్టుకుని కిడ్నాప్ చేసి, హత్య చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. సాగర్ హిల్‌కాలనీలో ఆయన బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పసివేముల గ్రామానికి చెందిన పండ్ల హరిశ్చంద్ర(60) తన కుమార్తెను బెజవాడ కోటమ్మకు వరుసకు కుమారుడయ్యే బ్రహ్మంకు ఇచ్చి పదేళ్ల కిందట పెళ్లిచేశాడు. ఇరు కుటుంబాల మధ్య గొడవల్లో కోటమ్మ కుమారుడు రమేష్‌కు, ఇతర కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. రమేష్ కోమాలోకి వెళ్లడంతో గుంటూరులో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ గొడవకు సంబంధించి హరిశ్చంద్రపై కేసు నమోదైంది. గొడవల అనంతరం హరిశ్చంద నల్లగొండ జిల్లా కనగల్‌కు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ప్రతి నెలా తనకు వచ్చే పెన్షన్ డబ్బులను ఎవరో ఒకరు సాగర్ హిల్‌కాలనీ వరకు తీసుకువచ్చి ఇస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 2న హిల్‌కాలనీకి ఓ వ్యక్తి పెన్షన్ డబ్బులు తీసుకుని వచ్చి ఇచ్చి వెళ్లాడు. హరిశ్చంద్రను చంపాలనుకున్న కోటమ్మ నాలుగు నెలలుగా అవకాశం కోసం ఎదురుచూస్తోంది. సాగర్‌కు హరిశ్చంద్ర వస్తున్నాడనే విషయాన్ని గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ నాగయ్య ద్వారా తెలుసుకుంది. కోటమ్మ పసివేముల నుంచి బెజవాడ వెంకటేశ్వర్లు, పండ్ల కోటేశ్వర్‌రావు, పోదమల్ల మహేష్, భార్గవ్‌లతో కలిసి బైక్‌పై సాగర్‌లోని ఆటోస్టాండ్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడ ఉన్న మరో నేరస్తుడు నేలపట్ల భాస్కర్ తన కారుతో వేచిఉన్నాడు. కోటేశ్వర్‌రావు రెండు కత్తులను తన బైక్‌లో తీసుకుని వచ్చాడు. అందులో ఒక కత్తిని కారులో పెట్టి మరో కత్తిని బైక్‌లో ఉంచాడు. కోటేశ్వర్‌రావు బైక్‌ను ఫైలాన్ ఆటోస్టాండ్ వద్ద పెట్టి భార్గవ్ బైక్‌పై హిల్‌కాలనీ ఇందిరమ్మ బొమ్మ వద్దకు వచ్చారు. ఐదుగురు నిందితులు తమ వాహనాలను రోడ్డు పక్కన ఆపుకుని హరిశ్చంద్ర కోసం వేచిచూశారు. ఉదయం 10 గంటలకు అక్కడకు హరిశ్చంద్ర రాగానే బలవంతంగా లాక్కుని కారులో ఎక్కించుకున్నారు. కోటమ్మ, కోటేశ్వర్‌రావు, భార్గవ్‌లు కారులోనే హరిశ్చంద్రపై దాడిచేశారు. కొట్టుకుంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎత్తిపోతల వైపునకు కారును తీసుకెళ్లారు. కారు రోడ్డు పక్కన ఆపి హరిశ్చంద్రను కారులో నుంచి దింపి పక్కనే ఉన్న బీడు భూమిలోకి 20 అడుగుల వరకు లాక్కెళ్లారు. అనంతరం ఐదుగురు కలిసి రాళ్లతో తలపై కొట్టిచంపారు. అక్కడ నుంచి వాడపల్లి మీదుగా భార్గవ్, కోటేశ్వర్‌రావు, వెంకటేశ్వరరావు పారిపోయారు. కాగా కోటమ్మ, బెజవాడ వెంకటేశ్వర్లు ఊరికి వెళ్లారు. ఈ మేరకు హరిశ్చంద్ర తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని నిందితుల కోసం వెతుకుతుండగా మంగళవారం మధ్యాహ్నం నేరస్తులకు ఆశ్రయం ఇచ్చిన నేలపట్ల బ్రహ్మం, మట్టపల్లి కోటేశ్వర్‌రావులు ఇద్దరు మాచర్లలో లాయర్‌ను కలవడానికి సాగర్ మీదుగా వెళ్తున్నారు. అటవీ శాఖ కార్యాలయం వద్ద నిందితులు ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మరో ఇద్దరు నేరస్తులు బెజవాడ బ్రహ్మం, నాగయ్యలు రైట్ బ్యాంకులో ఉండగా వారిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. వీరితో పాటు కారు, రెండు బైక్‌లు, 10 సెల్‌ఫోన్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సాగర్ సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ సంపత్, వీరబాబు, వీరశేఖర్, కానిస్టేబుళ్లు హేమంత్, వెంకన్న, రాంకోటి, జావీద్, ప్రశాంత్, రాంప్రసాద్, హోంగార్డులు శ్రీకాంత్, నరసింహలను డీఎస్పీ అభినందించారు.

అనుమానంతో భార్య హత్య



నర్సకుమారి (ఫైల్)

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం ఆమె హత్యకు దారితీసింది. మంగళవారం రాత్రి నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం ముదిమాణిక్యం గ్రామంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పూజల బాలసైదయ్యకు అదే గ్రామానికి చెందిన నర్సకుమారికి 15 ఏళ్ల క్రితం వివాహమైంది. బాలసైదయ్య అడవిదేవులపల్లి మండల కేంద్రంలో పానీపూరి బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారిద్దరూ హాస్టల్‌లో ఉండి విద్యనభ్యసిస్తున్నారు. బాలసైదయ్యకు భార్య నర్సకుమారి(35)పై అనుమానం ఉండడంతో వారి మధ్య మూడేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన బాలసైదయ్య నిద్రిస్తున్న భార్యపై కత్తిపీటతో దాడిచేశాడు. తలతోపాటు శరీరంపై విచక్షణ రహితంగా దాడి చేయటంతో ఆమె మృతిచెందింది. బుధవారం తెల్లవారుజామున వరుసకు సోదరుడు(నర్సకుమారి చెల్లెలి భర్త), పోలీసులకు ఫోన్ చేసి తన భార్యను హత్య చేసినట్లు చెప్పి పరారయ్యాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలి తండ్రి గువ్వల శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆచూకీ తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

జాతీయ రహదారి సమీపంలో ఏటీఎంలో చోరీ

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం శివారు జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగినా వినియోగదారుల సమాచారంతో బుధవారం రాత్రి ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అంకిరెడ్డిగూడెం శివారు జాతీయ రహదారి పక్కన ఉన్న ఏటీఎం షట్టర్ దింపి ఉండటంతో బుధవారం సాయంత్రం వరకూ ఎవరూ అటుగా వెళ్లలేదు. కొందరు వినియోగదారులు అనుమానంతో పోలీసులకు సమాచారమివ్వటంతో ఏటీఎం మిషన్‌లోని నగదు ఉంచే ప్రాంతం ధ్వంసం చేసినట్లు గుర్తించారు. మంగళవారం అర్ధరాత్రి దొంగలు ఏటీఎంలోకి ప్రవేశించి షట్టర్ కిందికి దించి గ్యాస్ కట్టర్‌తో నగదు భద్రపరిచే ప్రాంతాన్ని ధ్వంసం చేసినట్లు నిర్ధారించారు. ఏటీఎంలో భద్రపరిచిన నగదును దొంగిలించిన తర్వాత షట్టరు కిందికి దించి పరారయ్యారు. బుధవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఏసీపీ మధుసూదన్ రెడ్డి , సీఐ మన్మధకుమార్ , బ్యాంకు ఏటీఎం సిబ్బంది పరిశీలించారు. క్లూస్‌టీం రప్పించి వివరాలు సేకరించారు. గతంలో కూడా ఇదే ఏటీఎంలో చోరీ జరిగింది. ఈ ఘటనలో ఎంత నగదు అపహరణకు గురైందనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



అంకిరెడ్డిగూడెంలో చోరీకి గురైన ఏటీఎం

హత్యాయత్నం కేసులో మూడేళ్లు జైలు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నెలల కుమార్తెతో పాటు అత్తపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి బుధవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ వారు తెలిపిన వివరాల ప్రకారం చింతలపాలెం మండలం తమ్మవరం గ్రామానికి చెందిన ఆమెర సైదులు, లక్ష్మి దంపతుల కుమార్తె లావణ్యను గరిడేపల్లి మండలం గానుగబండకు చెందిన చిల్లా నర్సింహారావుకు ఇచ్చి పెళ్లిచేశారు. వీరికి నవ్యశ్రీ అనే కుమార్తె జన్మించింది. లావణ్య తల్లిదండ్రులను చూడడానికి కుమార్తెతో తమ్మవరం గ్రామానికి వెళ్లింది. భార్య, 10 నెలల కుమార్తెను తీసుకువెళ్లడానికి నర్సింహారావు 2018 జనవరి 2న అత్తగారింటికి వెళ్లాడు. కుమార్తెకు పాలు తాపిస్తానని చెప్పి లావణ్య ఇంట్లోకి వెళ్లడంతో తనవెంట తెచ్చుకున్న విషాన్ని పాలల్లో తాపించాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు భార్య, అత్తకు తెలిపారు. వెంటనే పాపను ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో అత్త ఆమెర లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉండగా, అల్లుడు నర్సింహారావు తన వెంట తెచ్చుకున్న బ్లేడుతో ఆమె గొంతు కోశాడు. తీవ్రరక్తస్రావమై కేకలు వేయగా స్థానికులు వచ్చి ఆమెను కాపాడారు.

మామ ఆమెర సైదులు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ పరమేష్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిపై చార్జిషీట్ దాఖలుచేశారు. వాదనల అనంతరం నిందితుడు నర్సింహారావుకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శ్యామ్‌కుమార్ తీర్పుచెప్పారు. జరిమానా నుంచి రూ.49వేలను బాధితురాలైన ఆమెర లక్ష్మికి చెల్లించాలని ఆదేశించారు.

ముద్ర యోజనలో 'పేట' ముద్ర

● ప్రధాని మోదీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న జిల్లావాసులు



ప్రధాని మోదీతో హుజూర్‌నగర్ ముద్ర మోజన లబ్ధిదారురాలు సృజన(సర్కిల్‌లో)

సూర్యాపేట (కలెక్టరేట్), హుజూర్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ముద్ర యోజన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన కలువల సృజన ఈ నెల 7న ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని సాయిబాబా థియేటర్ రోడ్డులో ముద్ర రుణం పొంది శారీ సెంటర్ నిర్వహిస్తున్నారు. ముద్ర బ్యాంక్ మేనేజర్ పిలుపు మేరకు ఢిల్లీ వెళ్లే అవకాశం లభించిందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, అందులో భాగంగానే బ్యాంక్ ద్వారా రుణం పొంది శారీ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా ముద్ర రుణాలు అందించి వాటి రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ కూడా ప్రధాని మోదీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. వీరిద్దరూ ప్రధాని నుంచి వేర్వేరుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

రూ.6 కోట్లకు 'గుట్ట' తలనీలాల టెండర్

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9(ఆంధ్యజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తలనీలాల సేకరణ టెండర్ రూ.6కోట్లకు పలికింది. భక్తులు స్వామివారికి సమర్పించే తలనీలాల సేకరణకు ప్రతి ఏటా దేవస్థానం టెండర్ నిర్వహిస్తుంది. మంగళవారం నిర్వహించిన టెండర్‌లో 15మంది పాల్గొనగా తమిళనాడుకు చెందిన కే.ఎం హేర్ ఇంటర్నెషనల్(ఇండియన్ రా హేర్ ఎక్స్‌టెన్షన్) సంస్థ ఏడాది కాలం పాటు రూ.6 కోట్లకు టెండర్ దక్కించుకుంది. టెండర్ నిబంధనల ప్రకారం మూడు వాయిదాల్లో నగదు చెల్లించాలి. రెండు వారాల్లో రూ.2కోట్లు చెల్లించిన తర్వాతే తలనీలాల సేకరణకు అనుమతిస్తారు. గత టెండర్ ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2024 వరకు ఉమశ్రీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ద్వారా రూ.5.5కోట్ల ఆదాయం సమకూరగా 2024 జూలై 1వ తేదీ నుంచి నుంచి(సుమారు ఏడు నెలలు) 8 ఏప్రిల్ 2025 వరకు దేవస్థానమే తలనీలాలు సేకరిస్తోంది. కాగా, ఇప్పటి వరకు తొమ్మిది సార్లు టెండర్లు నిర్వహించినప్పటికీ రూ.3 కోట్లకు మించి వేలం రానందున అధికారులు రద్దు చేస్తూ వచ్చారు. తాజాగా నిర్వహించిన టెండర్ వేలంలో రూ.6 కోట్లకు కే.ఎం హేర్ ఇంటర్నేషనల్ (ఇండియన్ రా హేర్ ఎక్స్‌టెన్షన్) సంస్థ దక్కించుకుంది. ఇప్పటి వరకు దేవస్థానం సేకరించిన తలనీలాలకు తూకం వేయాల్సి ఉంది.

మదర్‌డెయిరీలో.. అవిశ్వాస సెగ

(3వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో మదర్ డెయిరీ ఛైర్మన్ ఏకపక్ష నిర్ణయాలా? డైరెక్టర్ల విన్నపాలను కూడా పట్టించుకోకపోవడమా? పాలసంఘాలకు బిల్లుల మంజూరుపై జాప్యమా? అన్న అంశాలపై పార్టీ అధిష్ఠానం కూడా ఆరా తీస్తోంది. అవిశ్వాసానికి సిద్ధమైన డైరెక్టర్లతో ఇప్పటికే ఎమ్మెల్యేలు చర్చలు జరిపినట్లు తెలిసింది. డైరెక్టర్లు క్యాంపు రాజకీయాలు వీడి.., పార్టీ సూచనల మేరకు నడుచుకోవాలని సూచించినట్లు సమాచారం. అయితే డైరెక్టర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఎమ్మెల్యేను పట్టుబడుతున్నారు. మొత్తం 15మంది డైరెక్టర్లలో ఛైర్మన్ మినహా అందరూ కూడా అవిశ్వాసానికి మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో తాను ఎన్నుకున్న ఛైర్మన్ పదవి కొనసాగించాలా? లేక మెజార్టీ డైరెక్టర్ల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని ఆవిశ్వాసానికి మద్దతు తెలియజేయాలా? అనే అంశంపై ఎమ్మెల్యేలు తర్జనభర్జన పడుతున్నారు.

అప్పుల ఊబిలో సంస్థ

నల్లగొండ-రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల్లోనే మదర్‌డెయిరీ ఒకప్పుడు రైతుల శ్రేయస్సు, పాడి అభివృద్ధి కోసం పనిచేసింది. అలాంటి సంస్థ రానురాను అప్పుల ఊబిలో కూరుకుపోయింది. మదర్‌డెయిరీ ఎన్నికల సమయంలో పాడి రైతులకు హామీల వర్షం కురిపించారు. 270 మంది పాల సంఘాల ఛైర్మన్లతో శిబిరం నిర్వహించారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.4 బోనస్, ప్రభుత్వం తరపున రూ.30కోట్ల గ్రాంట్ తీసుకువస్తామని హామీ ఇచ్చారు. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లిస్తామన్నారు. అయితే పదవి చేపట్టి ఆరునెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. దీంతో పాల సంఘాల ఛైర్మన్లు సంస్థ పాలకవర్గంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

మదర్ డెయిరీ ఛైర్మన్‌ను మార్చే ప్రసక్తేలేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మదర్ డెయిరీ డైరెక్టర్లు

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మదర్ డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని మార్చే ప్రసక్తేలేదని డైరెక్టర్లు స్పష్టంచేశారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బిల్లు, బోనస్ చెల్లించడానికి సంస్థ అభివృద్ధి కోసం ఛైర్మన్‌తో కలిసికట్టుగా పాటుపడుతామని, డైరెక్టర్లలో విభేదాలు వచ్చాయని అనడంలో వాస్తవం లేదన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఈ నెల 15వ తేదీ లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సంస్థకోసం రూ.20కోట్లు మంజూరు చేయాలని కోరనున్నట్లు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఛైర్మన్ మార్పు ఉండదని, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే కలిసికట్టుగా రైతులకు పెండింగ్ బిల్లులు, బోనస్ విషయంలో ఇబ్బందులు లేకుండా, సంస్థను అభివృద్ధి బాటలో నడుపుతామన్నారు. సమావేశంలో మదర్ డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు కల్లెపల్లి శ్రీశైలం, రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, ఉప్పల్‌రెడ్డి, పుప్పాల నర్సింహ, నర్సింహ్మారెడ్డి, శ్రీదర్‌రెడ్డి, బత్తుల నరేందర్‌రెడ్డి ఉన్నారు.

వడదెబ్బ.. జర జాగ్రత్త

● మునిపంపుల వైద్యాధికారి డాక్టర్ అశ్విన్‌కుమార్

సమ్మె కోసం



రోజురోజుకూపెరుగుతున్న ఎండలకు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అశ్విన్‌కుమార్ కోరారు. ఎండ వేడిమి పెరుగుతుండడంతో జ్వరం, తలనొప్పి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారు ఆసుపత్రికి వస్తున్నారని, ప్రజలు బయటికి వెళ్లే సమయంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని ఇలా సూచించారు.

● గ్రామాల్లో రైతులు, ఉపాధి హామీ కూలీలు ఉదయం 11 గంటల లోపు పనులు ముగించుకోవాలి.

● తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలో బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, తెల్ల రుమాలు ధరించాలి.

● గర్భిణులు, బాలింతలు, 10సంవత్సరాల పిల్లలు, 60సంవత్సరాలు పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి.

● తరుచూ శుభ్రమైన నీటిని తాగాలి.

● ఫ్రూట్ జ్యూస్, ద్రవశాతం ఎక్కువ ఉండే పుచ్చకాయ, బత్తాయి, సంత్రాలు, ద్రాక్ష ఎక్కువ పొటాషియం కలిగిన అరటి పండ్లు తీసుకోవాలి.

● వీలైనంతవరకు టీ, కాఫీ, మద్యం, తీపి పదార్థాలు అధిక ప్రొటీన్ గల ఆహారం, ధూమపానం, కూల్‌డ్రింక్స్ సోడా, ఎక్కువ కారం, మసాలాలతో ఉన్న ఆహారం తీసుకోవద్దు.

● రామన్నపేట, ఆంధ్రజ్యోతి.

కృష్ణా.. నీ ప్రతిభ అద్భుతం



దుండిగల్‌లోని గణపతి సచ్చిదానందస్వామీజీ నుంచి బంగారు పతకం అందుకుంటున్న సంగెం కృష్ణ(ఫైల్)

యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన సంగెం కృష్ణ పుట్టుకతో అంధుడు. రెండు కళ్లు కనిపించకపోయినా విద్యాభ్యాసం కొనసాగించాడు. పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే భగవద్గీత శ్లోకాలు పఠించేవాడు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో ప్రతిభ చాటి దుండిగల్‌లోని గణపతి సచ్చిదానంద ఆశ్రమం నుంచి బంగారు పతకం అందుకున్నాడు. కృష్ణకు చిన్నప్పటి నుంచీ చదరంగం ఆటపై మక్కువ. అందులో రాణించాలనే తపన ఉంది. తరుచూ చదరంగం పోటీల్లో పాల్గొనేవాడు. ఉద్యోగం చేస్తూ.. ఇటు భగవద్గీత శ్లోక పఠనంలో, చదరంగంలో రాణిస్తున్న కృష్ణ ప్రతిభ అసామాన్యం.

- ఆంధ్రజ్యోతి, భూదాన్‌పోచంపల్లి

» పుట్టుకతో అంధుడు.. ప్రతిభ అసామాన్యం!
» భగవద్గీత శ్లోక పఠనంలో విశేష ప్రతిభ
» గణపతి సచ్చిదానంద ఆశ్రమం నుంచి బంగారు పతకం
» ఆధ్యాత్మికంతోపాటు చదరంగంపై మక్కువ
» పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన కృష్ణ

సంగెం కృష్ణ భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన చేనేత పద్మశాలి కుటుంబీకులైన సంగెం రాములు-లలిత దంపతుల రెండో కుమారుడు. ప్రాథమిక విద్యాభ్యాసంతోపాటు ఉన్నత పాఠశాల వరకు 1నుంచి 10వ తరగతి హైదరాబాద్‌లోని దారుషాఫాకు చెందిన ప్ర భుత్వ బాలుర అంధుల ఉన్నత పాఠశాలలో పూర్తిచేశాడు. ఈ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి స్కూల్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఇంటర్మీడియట్ 2010 నుంచి 2012 వరకు శ్రీత్రిదండి రామానుజ చినజీయర్ స్వామిజీ ఆశ్రమంలోని 'నేత్ర విద్యాలయం'లో పూర్తి చేశాడు. 2012 నుంచి 2017 వరకు మహాత్మా గాంధీలా కాలేజీలో బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేశాడు.

పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగం

ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో కృష్ణ పలు కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకున్నాడు. 2017 నుంచి అనేక పోటీ పరీక్షలకు, గ్రూప్ టెస్టులకు హాజరయ్యాడు. 2022-23 విద్యా సంవత్సరంలో గ్రూప్-4 పరీక్షకు హాజరై ఉత్తమ మార్కులు సాధించాడు. 2024 డిసెంబరు నెలలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. నిత్యం తను భగవద్గీత శ్లోకాల పఠనం పోటీల్లో పాల్గొంటూ తన ప్రతిభను చాటుతున్నాడు. ఏ శ్లోకమైనా సరే.. మొదటి ఒక పాదం చెప్పగానే ఆ శ్లోకం పూర్తిగా చదవడంతో పాటు ఉవాచను సైతం అప్పచెప్పేస్తాడు.



తన ఆరాధ్య గురువులు రుద్ర బాలమణి, అనసూయలతో సంగెం కృష్ణ

భగవద్గీత శ్లోకాల పఠనంలో..

ఆన్‌లైన్ ద్వారా భగవద్గీత శ్లోకాల పఠనం పోటీల్లో 18అధ్యాయాల్లోని 701 శ్లోకాలను అడిగినదే తడవుగా పఠించాడు. హైదరాబాద్ నగర శివారులోని దుండిగల్‌లోని ప్రసిద్ధ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో ఇటీవల స్వామీజీ నుంచి బంగారుపతకం, ప్రశంసాపత్రం అందుకున్నాడు. కృష్ణ ప్రతిభను చూసి గణపతి సచ్చిదానంద స్వామీజీ అభినందించారు.

చదరంగంలోనూ రాణిస్తూ..

చదరంగం(చెస్) ఆట అంటే ఎంతో ఇష్టం. చదరంగం పోటీలు ఎక్కడ నిర్వహించినా పాల్గొనేవాడు. ఆన్‌లైన్ చెస్ పోటీల్లో పాల్గొంటూ సాధన చేస్తున్నాడు. 2019 నుంచి చదరంగంలో శిక్షణ పొందుతున్నాడు. చదరంగంలో మంచి ప్రావీణ్యం.. ఇటు భగవద్గీత శ్లోకాల పఠనంపై విద్యార్థులను తయారు చేయాలనే ధ్యేయంతో ఉన్నానని కృష్ణ పేర్కొన్నాడు. తన ఆరాధ్యదైవం శివుడు అని అన్నారు.

ఆరాధ్య గురువులే నాకు మార్గదర్శకులు



నాకు భగవద్గీత శ్లోక పఠన పోటీలకు తయారయ్యేందుకు ఇద్దరు ఆరాధ్య గురువులున్నారు. భూదాన్‌పోచంపల్లికి చెందిన రుద్ర బాలమణి, మల్కాజ్‌గిరికి చెందిన అనూరాధ నాకు ఆరాధ్య గురువులు. వారి పర్యవేక్షణలోనే భగవద్గీత శ్లోకాల పఠనంతోపాటు ఆన్‌లైన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యా. ఇందులో 18 అధ్యాయాల్లో ని 701 శ్లోకాల పఠనం చేసి ప్రతిభ చాటినందుకు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ నాకు బంగారు పతకం ప్రదానం చేశారు.

- సంగెం కృష్ణ

బకాయిలు చెల్లించకుంటే పరీక్షలు నిర్వహించలేం

● మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎదుట డిగ్రీ కళాశాల యాజమాన్యాల నిరసన ● వీసీకి వినతిపత్రం అందజేత

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఆర్‌టీఎఫ్- ఎంటీఎఫ్ నిధులు విడుదల చేసే వరకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో రెండు రోజుల్లో జరగనున్న డిగ్రీ పరీక్షలు నిర్వహించలేమని డిగ్రీ కళాశాల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. తెలంగాణ డిగ్రీ, పీజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు ఎంజీ యూనివర్సిటీ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. వీసీ, రిజిస్ట్రార్, ఎగ్జామ్స్ కంట్రోలర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించే ఫీజుల ద్వారా మాత్రమే ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు నిర్వహిస్తారన్నారు. నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం ఆర్‌టీఎఫ్(రీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజు), ఎంటీఎఫ్(విద్యార్థులకు చెల్లించే ఫీజు) చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ అంశాలపై తొమ్మిది నెలలుగా నెలలుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదన్నారు.



మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు

ఇటీవల రాష్ట్రంలోని కొన్ని జిల్లాలకు మాత్రమే కొంత మేరకు నిధులు విడుదల చేసినా ఎంజీయూ పరిధిలోని ఉమ్మడి జిల్లాకు చెందిన కళాశాలలకు ఫీజులు చెల్లించడంలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు ఆరు నెలలుగా వేతనాలు, కళా శాలల భవన యజమానులకు అద్దెలు చెల్లించడం భారంగా మారిందన్నారు. కళాశాలల సిబ్బంది సహాయ నిరాకరణ, భవన యాజమాన్యాల వేధింపుల కారణంగా త్వరలో జరిగే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించే స్థితిలో లేమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మైలరిశెట్టి. సైదారావు, కోశాధికారి దరిపల్లి ప్రవీణ్, బి. శంకరయ్య, ఏ. సత్యంగౌడ్, ఎం. వెంకట్‌రెడ్డి, శంకర్, రాజశేఖర్‌రెడ్డి, హనుమంతు, సూర్యనారాయణ, ఆదిత్య స్రామాట్, ఎం. సుబాష్‌రెడ్డి, పి. భాస్కర్‌రావు, కె. రాంమోహన్, టి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడింగ్ క్లాసులు

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వం అందిస్తోంది. దీంతో రోజురోజుకూ సాంకేతికతలో వస్తున్న మార్పులను అందుకోవాలంటే చదువుతో పాటు కంప్యూటర్ నైపుణ్యం, కోడింగ్, ఏఐలో శిక్షణ అవసరమని ప్రభుత్వ గుర్తించింది. దీంతో విద్యార్థులకు కృత్రిమ మేధ(ఏఐ), రోబోటిక్స్, ఆన్‌లైన్ టూల్స్‌తో పాటు, కోడింగ్‌లో శిక్షణకు ప్రత్యేక తరగతులను నిర్వహించనున్నారు.

శిక్షణ ఇలా.. విద్యార్థులు రోజుకు రెండు గంటల పాటు కోడింగ్‌పై తరగతులు నిర్వహించి, అనంతరం ప్రాజెక్టు తరగతులు నిర్వహిస్తారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. కోడింగ్‌కు తరగతుల బోధనను, శిక్షణ పొందిన కోడింగ్ మెంటర్స్ చేస్తారని పేర్కొంటున్నారు. శిక్షణకు పాఠశాలలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబోరేటరీలు వస్తుండటంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఎంతో సహాయపడతాయంటున్నారు. ఇదిలా ఉంటే కోడింగ్ శిక్షణకు సంబంధించి సర్టిఫికెట్ అందుకుంటారని వారంటున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	515.60
టీఎంసీలు	142.0820
ఎడమకాల్వకు నీటి విడుదల	4,881
కుడికాల్వకు	2,053
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	8,334

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.02 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	625.30 అడుగులు
టీఎంసీలు	0.87
కాల్వలకు విడుదల	14.40 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	572.10 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	44.72క్యూసెక్కులు



తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనార్చనలు నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండి జోడు సేవలు, సహస్రనార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహిం చారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.13,37,470ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

హస్త కళలను ప్రోత్సహించాలి

● దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు క్షేత్రానికి వచ్చే భక్తులు హస్త కళలకు సంబంధించిన వస్తువులను కొనుగోలు చేసి తగిన ప్రోత్సాహం అందించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మేనేజింగ్ డైరెక్టర్ శైలజారామయ్యర్ పిలుపునిచ్చారు. తెలంగాణ హస్త కళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గోల్కొండ హస్త కళల విక్రయశాలను జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ హస్త కళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్త కళలకు సంబంధించిన వస్తువులు కొండపైన గోల్కొండ హస్తకళల విక్రయశాలలో లభిస్తాయన్నారు. హస్తకళలను ప్రోత్సహించేందుకు ఇక్కడ విక్రయశాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి సంస్థ ఓఎస్డీ బాషా, మసూద్ అలీ, వేణుగోపాల్, గాయత్రి, సుల్తానా, శ్రీపాణి, మహేందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్





ఆటోమెటిక్ యంత్రం.. ధాన్యం శుభ్రం

నల్లగొండ జిల్లాకేంద్రం సమీపంలోని ఆర్జాలబావి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌కు ప్రభుత్వం రూ.8లక్షల విలువైన ఆటోమెటిక్ ప్యాడీ యంత్రాన్ని అందజేసింది. దీంతో రైతులు కొనుగోలు కేంద్రానికి తరలించిన ధాన్యంలో తాలు, మట్టి పెళ్లలు వేరు చేయడానికి ఈ యంత్రం ఉపయోగపడుతుంది. ధాన్యం తూర్పార పట్టేందుకు, ధాన్యం శుభ్రం చేసుకోవడానికి యంత్రం ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చిట్యాల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ నాగరాజు కోరారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చిట్యాలలో బుధవారం రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, రోడ్డుపై వాహనాలు నిలుపవద్దన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వాహనాలను జాగ్రత్తగా నడపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ధర్మా, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మర్రిగూడ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండలంలోని శివన్నగూడ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు చైర్మన్ బాలెం నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఖుదాభక్షుపల్లి, శివన్నగూడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని కోరారు.

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు

నల్లగొండరూరల్, ఏ ప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రైతు లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎ మ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు డిమాండ్ చేశారు. రైతుసంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ పూర్తిగా అమలు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజాల రామచంద్రం, నాయకులు బంటు వెంకటేశ్వర్లు, కనకయ్య, బుర్ర శేఖర్, బండమీది వెంకన్న పాల్గొన్నారు.

ఒకేసారి ఎలక్షన్‌పై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

నాంపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఒకేసారి దేశమంతటా ఒకేసారి ఎలక్షన్ నిర్వహించడానికి కృషి చేస్తుందని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అమలు చేయనున్న వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని, బీజేపీ నాయకులు 'ఛలో బస్తీ - ఛలో అభియాన్' కింద గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నరసింహ, ఎస్టీ మోర్చా రాష్ట్ర కోశాధికారి వడ్త్యా శంకర్‌నాయక్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు పానగంటి మహేష్ గౌడ్, నాయకులు చల్లమల్ల కాంతారెడ్డి, నాంపల్లి సతీష్, పంగ ఈశ్వర్, మారపాకుల శివ, శ్రీధర్‌రెడ్డి, ప్రశాంత్, శంకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

కనగల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కనగల్ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రేవంత్ సర్కార్ పేదలకు అండగా ఉంటుందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, జియావుద్దీన్, గోగు యాదయ్య, ఏటెల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

శాలిగౌరారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలకు స్వచ్ఛంద సేవలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో అశోక్‌రెడ్డి కోరారు. శాలిగౌరారంలో చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వివిధ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారని వారికి వేసవిలో దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.యాదగిరి, ఎస్‌బీఐ మేనేజర్ వై.శ్రీనివాసరావు, టీజీజీవీబీ మేనేజర్ జామ్లా నాయక్, లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ, సభ్యులు సీఎం రెడ్డి, మారం వేణుగోపాల్‌రెడ్డి, దునక వెంకన్న, రామడుగు వెంకట్రామశర్మ, శేఖర్‌బాబు, రామ్మూర్తి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్వుగట్టులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చలివేంద్రం ఏర్పాటుతో పుణ్యక్షేత్రమైన చెర్వుగట్టుకు భక్తులకు తాగునీటి ఇబ్బందులు తొలుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శి గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

యశోధర టౌన్‌షిప్ వివాదంపై జడ్పీ సీఈవో విచారణ

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు రెవెన్యూ పరిధిలో గల యశోధర టౌన్‌షిప్ వివాదంపై జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి బుధవారం విచారణ జరిపారు. యశోధర టౌన్‌షిప్‌కు సంబంధించి కొన్నేళ్లుగా వివాదం నడుస్తుంది. సుమారు 50 ఎకరాల్లో చేసిన వెంచర్‌లో విక్రయించిన కొన్ని ప్లాట్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయన్న కారణంగా వివాదం ఏర్పడింది. దీనిపై చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు కూడా ధర్నా చేశారు. ఈ వివాదాలపై గతంలోనే ఫిర్యాదులు వెళ్లాయి. తాజాగా ఎల్ఆర్ఎస్ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్పీ సీఈవో విచారణ చేపట్టారు. ఈ వివాదానికి సంబంధించి 2012 నుంచి 2021 వరకు ఇక్కడ పనిచేసిన ఈవోపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులను పిలిచి వెంచర్‌కు సంబంధించిన గ్రామపంచాయతీ అనుమతులు తదితర అంశాలపై వారి నుంచి వివరాలను సేకరించినట్లు సమాచారం.

కాలనీల్లో సమస్యల తిష్ఠ

- ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- సీబీఎఫ్ నిధులు తిరిగి మంజూరయ్యేనా?
- శ్రీనగర్, ఎన్జీవోస్, ఆదిత్య కాలనీల్లో తాగునీటి సమస్య
- ఇదీ 19వ వార్డు పరిస్థితి



శ్రీనగర్ కాలనీ ప్రధాన రోడ్డులో వర్షం కురిసినప్పుడు దుస్థితి (ఫైల్ ఫొటో)



కాలనీలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నల్లగొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని 19వ వార్డులో సమస్యలు తిష్ట వేశాయి. కాలనీల్లో సమస్యల పరిష్కారానికి అధికారులే పూర్తిస్థాయి బాధ్యత వహించాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలుస్తుంది. పట్టణ పరిధిలోని పానగల్ రోడ్డులో ఉన్న నందీశ్వర్ కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపైనే ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను షిఫ్టింగ్ చేయాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు 3, 19 వార్డుల మధ్యలో ఉండటంతో ప్రజల రాకపోకలు ఇబ్బందులుగా మారాయి. 3, 19 వార్డులలోని శ్రీనగర్ కాలనీలోని పైభాగంతో పాటు ఆదిత్య కాలనీ, ఎన్జీవోస్ కాలనీలో కొంత భాగంలో త్రీఫేజ్ వైర్ లేకపోవడంతో పాటు లోవోల్టేజీ సమస్యలు అధికంగా ఉంటున్నాయి. అదేవిధంగా శిథిలమైన స్తంభాలను మార్చాలని, అవసరమైన చోట ఇంటర్మీడియట్ పోల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే కొట్టుమిట్టాడుతున్నాయి.

సీబీఎఫ్ నిధులు మంజూరు చేయాలి...

గతంలో 19వ వార్డులో అభివృద్ధి పనుల కోసం రూ.10లక్షల సీబీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. అయితే వాటిని కొన్ని నెలల క్రితం రద్దు చేయడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. శ్రీనగర్ కాలనీ, ఆదిత్య కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, దీపక్‌నగర్ కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ, అమూల్య కాలనీల్లో గుంతలు పూడ్చడానికి ఈ నిధులను వెచ్చించాల్సి ఉంది. సీబీఎఫ్ నిధులు రద్దు కావడంతో తిరిగి ఆ నిధులను మంజూరు చేయాలని కోరుతూ ఆయా కాలనీవాసులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా కాలనీల్లో రోడ్లు గుంతలమయవడంతో వర్షం వస్తే రోడ్లు బురదమయమై రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అదేవిధంగా శ్రీనగర్ కాలనీతో పాటు ఎన్జీవోస్ కాలనీ, ఆదిత్య కాలనీల్లో మంచినీటి సమస్య తీవ్రంగా మారింది. కొత్త పైపులైన్లు వేయాల్సి ఉన్నా రెండేళ్లుగా ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి సమస్య పరిష్కారం లభించడం లేదు. సమస్యను పరిష్కరించాలని కోరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకపోతే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేసిన ప్రాంతంలో సిమెంట్ రోడ్లను కట్ చేయడం వల్ల ప్రజలకు, వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి



జిల్లా కేంద్రంలోని 19వ వార్డులోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి. వార్డులోని ప్రధాన రోడ్లన్నింటినీ సీసీ రోడ్లుగా మార్చాలి. వార్డులో 1000 కుటుంబాలు నివసిస్తున్నాయి. వార్డులో ఐమాస్ట్ లైట్లు, ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేసినా మునిసిపాలిటీ అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమయంలో తవ్విన సిమెంట్ రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలనీల్లో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం వస్తేనే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. గతంలో కేటాయించిన రూ.10లక్షల సీబీఎఫ్ నిధులు మంజూరు చేయాలి.

- కొండూరు సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్

ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలి



కనగల్ : ధాన్యం తేమను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కనగల్, చిట్యాల, మర్రిగూడ, కట్టంగూరు, నార్కట్‌పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం కనగల్ మండలంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, చిట్యాల, నార్కట్‌పల్లిలో డీఏవో శ్రవణ్‌కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని, ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలన్నారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ పొందాలన్నారు. ధాన్యం కేంద్రాల వద్ద టెంట్ నీడ, తాగునీటి వసతిని కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. సీరియల్ ప్రకారం కాంటాలు వేయాలన్నారు. తూకం వేసిన బస్తాలను సకాలంలో మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కనగల్‌లో సివిల్ సప్లయ్ డీఎం హరీష్, ఏవో అమరేందర్‌గౌడ్, ఏపీఎం హరి, సీసీ వసంత, వీపీసీ కమిటీ నిర్వాహకులు ధనలక్ష్మి, సునీత, చిట్యాల, నార్కట్‌పల్లిలో కార్యక్రమాల్లో డీసీవో పత్యానాయక్, ఏవో గిరిబాబు, మానిటరింగ్ ఆఫీసర్ రేణుక, ఏఈవోలు మనీషా, పీఏసీఎస్ సీఈవో బ్రహ్మాచారి, ఏవో గౌతమ్, నవీన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో ఐకేపీ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మాల్ మార్కెట్ చైర్మన్ దొంతం అలివేలుసంజీవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్, నాయకులు మేతరి యాదయ్య, పాశం సురేందర్‌రెడ్డి, మాల్ మార్కెట్ మాజీ చైర్మన్ అనిల్‌రెడ్డి, నాయకులు శ్రీను, వెంకటేష్‌గౌడ్, కొండల్, బాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలోని పందెనపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, ఏవో గిరిప్రసాద్, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, నాయకులు శ్రీను, పెద్ది సుక్కయ్య, కుంభం అనిల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు, యాదగిరిరెడ్డి, పరమేష్, శివ, నర్సింహ, స్వామి, చంద్రయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీ ఫీడర్, ఎస్ఎల్‌బీసీ టౌన్, కతాల్‌గూడ, గోకుల్‌నగర్, జేఎల్ ఫంక్షన్‌హాల్ ఏరియా, గంధవారిగూడెం, గుండగోని మైసయ్య ఫంక్షన్‌హాల్ ఏరియా, భాగ్యనగర్ కాలనీ, తెలంగాణ కాలనీ, సాగర్‌రోడ్డు, మునుగోడు ఎక్స్ రోడ్డు, సూర్యవంశీ కాలనీ 1,2, వెంకటరమణ కాలనీ, అసద్‌నగర్, నేషనల్ ఫంక్షన్‌హాల్, డీవీకే రోడ్డు, చైతన్యపురి కాలనీ, మేళ్ల దుప్పలపల్లి రోడ్డు, లూయిజ్‌నగర్ కాలనీ, గణేష్‌నగర్, మండలంలోని అప్పాజీపేట, పీడీపల్లి, రాములబండ, మామిళ్లగూడెం, కొత్తపల్లి, మేళ్లదుప్పలపల్లి, శ్రీ రామానంద తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఎం.వేణుగోపాలాచార్యులు తెలిపారు. సంబంధిత ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యారంగ సమస్యలపై ఎన్ఎస్‌యూఐ పోరాటం



ఎంజీ యూనివర్సిటీలో సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యూఐ పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా నాయకుడు అల్లి అంజన్‌యాదవ్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఎంజీ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1971లో ప్రారంభించిన ఎన్ఎస్‌యూఐ 55 సంవత్సరాలు విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. అదేవిధంగా ఎంతో మంది విద్యార్థి నాయకులను రాష్ట్ర, జాతీయ నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఎన్ఎస్‌యూదేనని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్‌గౌడ్, ఏకుల గణేష్, సుధీర్, ప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిట్యాలలో సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

చిట్యాల, చండూరురూరల్, కనగల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జయలక్ష్మి అన్నారు., చిట్యాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షంలో భాగంగా బుధవారం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఎలాంటి విటమిన్ లోపం లేకుండా ఉండాలంటే వెయ్యి రోజులు అంటే బిడ్డ కడుపులో ఉన్నప్పటి నంచి రెండేళ్లు వచ్చే వరకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందే పోషకాహారం తీసుకోవాలని అన్నారు. అంతేకాక అంగన్‌వాడీ టీచర్ ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో మునుగోడు సీడీపీవో లావణ్య, ఏసీడీపీవో వెంకటమ్మ, ఐసీడీఎస్ శ్రీదేవి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు దాడి అరుణ, అపర్ణ, బుజ్జమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

● చండూరు మండలంలోని పడమటితాళ్ల, బంగారిగడ్డ, దోనిపాముల గ్రామాల్లో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ మాట్లాడుతూ మహిళలు శిశు సంరక్షణ, శిశు పోషణ వంటి వాటిపై దృష్టి సారించాలని అన్నారు. గర్భిణులు ప్రెగ్నెన్సీ మొదలు నుంచి డెలివరీ తర్వాత బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు పోషణ కలిగిన ఆహారం, ఆకుకూరలు, పండ్లు వంటి వాటిని తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు సునీత, మౌనిక, శారద, శైలజ, కవిత, తారక, శివలీల, ఆయాలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కనగల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్

● కనగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో పోషణ్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 22వ తేదీ వరకు జరిగే పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. పోషకాహార ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మ, సీడీపీవో హరిత, సూపర్‌వైజర్లు శ్రీలత, మంజుల, ఏపీఎం హరి, ఏపీవో సుధాకర్, పోషణ్ అభియాన్ బీసీ కవిత తదితరులు పాల్గొన్నారు.

పండగలా కేసీఆర్ బహిరంగ సభ



బస్సుకు పోస్టర్లు అంటిస్తున్న చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, ఏప్రిల్ 9, (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభ పండుగను తలపించే విధంగా చేపట్టన్నుట్లు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆర్టీసీ బస్సులకు ఆయన అతికించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ బహిరంగ సభ కోసం దేశమంతా తెలంగాణ వైపు ఎదురు చూస్తుందన్నారు. నకిరేకల్ నియోజకవర్గం నుంచి బహిరంగ సభకు స్వచ్ఛందంగా ప్రజలు తరలేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. కేసీఆర్ హయాంలో పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపాడని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కట్టంగూరు మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, నాయకులు పల్లె విజయ్, రాచకొండ వెంకన్న, యానాల లింగారెడ్డి, నాగిళ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సారూ.. 'మద్దతు' ఇప్పించరూ!

(3వ పేజీ తరువాయి)

ఖరీదును వేసి రైతులకు ఇస్తున్నారు. దీంతో తక్కువ ధరకు కొనుగోలు చేసిన మిల్లరు పేరు బయటికి రాకుండా జాగ్రత్త పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ధాన్యం ధరల్లో కోత

మిర్యాలగూడ రూరల్: మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను ముంచుతున్నారు. మిల్లర్లతో జిల్లా అధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసినా వారి తీరు మారడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడలోని యాద్గార్‌పల్లి, గూడూరు, వెంకటాద్రిపాలెం, తుంగపాడు గ్రామాలతోపాటు పట్టణంలో ఉన్న 150 మిల్లుల్లో సగానికిపైగా మిల్లుల్లో నామమాత్రంగా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా రైస్‌మిల్లులు కలిగి ఉన్న మిర్యాలగూడకు పెద్దవూర, హాలియా, త్రిపురారం, తిప్పర్తి, మాడ్గులపల్లి, వేములపల్లి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, కోదాడ, మేళ్లచెర్వు, జాన్‌పహాడ్, దామరచర్ల ప్రాంతాలనుంచి అత్యధికంగా ధాన్యం విక్రయించేందుకు రైతులు ధాన్యం లోడ్‌లను తెస్తున్నారు. రైతులు ఒకే సమయంలో ధాన్యం కోతలు ప్రారంభించడంతో మిల్లర్లు తమదైన శైలిలో ధాన్యం కొనుగోలు చేపడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. రూ.2,450నుంచి ధర పలికిన ధాన్యానికి కేవలం రూ.2వేలు, రూ.2100కు కొనుగోలు చేస్తున్నట్లు తెలుపుతున్నారు. మిల్ పాయింట్లకు తెచ్చిన ధాన్యాన్ని వెనక్కి తీసుకెళ్లలేని రైతులు మిల్లర్లు చెప్పిన ధరకే విక్రయిస్తూ నష్టపోతున్నారు. రైతుల దయనీయ పరిస్థితులపై అధికారులు సైతం మిల్లర్లను ఆదేశించే పరిస్థితులు కనపడడం లేదని, సిండికేట్‌గా మారిన మిల్లర్ల వైఖరి రైతులకు తీవ్ర నష్టం కలిగేలా ఉందని వాపోతున్నారు. దీనికి తోడుగా ధాన్యం అధిక స్థాయిలో మిల్ పాయింట్లకు చేరుకున్న సందర్భంగా కొన్ని మిల్లులు ధాన్యం కొనుగోళ్లను నిలిపివేస్తూ సిం డికేట్‌గా మారిన వారు మాత్రమే కొనుగోలు చేపట్టేలా తమ వ్యవహారాన్ని సాగిస్తున్నట్లు తెలుస్తుంది.

చింట్లు రూ.2100కే విక్రయించా



చింట్ల రకాన్ని ధాన్యం మిల్లు వద్దకు తెచ్చా. క్వింటా రూ.2100కే కొనుగోలు చేశారు. అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే ఎవరు ఎక్కడున్నారో తెలియ లేదు. పర్యవేక్షణాధికారి ఫోన్ నెంబరు, వివరాలు తెలియదు. ఎక్కడ ఫిర్యాదు చేయాలో కూడా వివరాలు ప్రకటించలేదు. మిల్లర్ చెప్పిన ధరకే ధాన్యం విక్రయించాల్సి వచ్చింది.

● రావు మట్టారెడ్డి, రైతు, పాములపాడు, మాడ్గులపల్లి మండలం

ఫిర్యాదులు అందలేదు

ఉదయంనుంచి అన్ని మిల్లుల వద్ద రెవెన్యూ అధికారులను పర్యవేక్షణకు ఏర్పాటు చేశాం. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. మిల్లుల్లో మద్దతు ధర రాకుంటే రైతులు బోనస్‌ను వినియోగించుకునేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి.

జావీద్, డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లయ్

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి : వామపక్షాలు



నకిరేకల్‌లో గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, నకిరేకల్, నాంపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ సంస్థలు, కంపెనీలకు లాభాలు పెంచేందుకు ప్రజలపై తరచూ పన్నుల భారం మోపుతుందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్, ధర, ట్యాక్స్ పెంచడాన్ని నిరసిస్తూ దిష్టిబొమ్మలను దహనం చేశారు. పెంచిన గ్యాస్ ధరను తగ్గించే వరకు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చ రించారు. ధరలను అదుపు చేయలేని ప్రభుత్వాలు వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు.

● నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సీ పీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, రైతు సంఘం జిల్లా ప్రధా న కార్యదర్శి గురిజా రామచంద్రం, ఏఐవైఎస్ఐ జిల్లా కార్యదర్శి తిర్పారి వెంకన్న, బంటు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో కట్టెల పొయ్యి, ఖాళీ సిలిండర్‌తో వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకురాలు తుమ్మల పద్మ, నాయకులు గుండాల నరేష్, బొల్లు రవీందర్, రాము, కార్యదర్శి సునీత, జయశ్రీ, అంతమ్మ, నరేందర్ పాల్గొన్నారు.

● నకిరేకల్‌లో సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కేంద్రప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రాఘవరెడ్డి వర్ధంతిని మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, నాయకులు చెన్నబోయిన నాగమణి, బహిరోజు ఇందిర, కృష్ణ, సాకుంట్ల నర్సింహ, అంజయ్య, పరమేష్, తాజేశ్వర్, యల్లయ్య, శశికళ, ఆదిమళ్ల సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

● నాంపల్లి మండల కేంద్రంలో సీపీఐ మండల నాయకులు ఉరిపాక వెంకటయ్య, నేతల రాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కేంద్రప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు కోరే సత్తయ్య, దండిగ వెంకటయ్య, పల్లె సైదులు, గిరి స్వామి, కానుగుల మహేష్, ప్రశాంత్, వెంకటాచారి, సైదులు, దశరథ, యాదయ్య, రవి పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0 , కనిష్ఠం 24.0



మిల్‌పాయింట్ వద్ద నిలిచిన ధాన్యం ట్రాక్టర్లు

సారూ... మద్దతు ఇప్పించరూ!

ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు అగచాట్లు పడుతున్నారు. సన్నధాన్యంలో ప్రధానంగా పండించిన కావేరి చింట్లు రూ.2,100కు, మహీంద్ర చింట్లు, హెచ్‌ఎంటీ రకాల ధాన్యం తక్కువకే కొనుగోలు చేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. మిల్లరు ధాన్యానికి మద్దతు ధరకు కొనుగోలు చేసేలా పర్యవేక్షించేందుకు మిల్లు పాయింట్ల వద్ద రెవెన్యూ అధికారులను ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

» క్వింటా రూ.2050కే కొనుగోలు » రెండు రోజులుగా ధర తగ్గించిన మిల్లర్లు » మిర్యాలగూడ మిల్లర్ల తీరుపై రైతుల గగ్గోలు » శెట్టిపాలెం మిల్లుల వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు

ఒక్కో ట్రాక్టర్ లోడుకు ఒక్కో ధర చొప్పున మిల్లర్లు కొనుగోలు చేస్తుండడంతో తమ ధాన్యానికి ఎంత ధర పెడతారోనని ఆందోళనతో మిల్లుల ఎదుట రైతులు పడిగాపులు కాస్తున్నారు. రాత్రికే మిల్లులకు చేరినప్పటికీ సాయంత్రం వరకు కొనుగోలు చేయడంలేదంటున్నారు. పట్టణంలో మిల్లుల వద్ద వందల సంఖ్యలో ధాన్యపు ట్రాక్టర్లు బారులు తీరుతుండగా మిల్లర్లు తమకు తోచిన ధరకు కొనుగోలు చేస్తునారని అంటున్నారు. రైస్ మిల్లర్లు రైతులను నిలువునా దోపిడి చేస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

క్వింటాకు రూ.2050కే కొనుగోలు

సిండికేట్‌గా మారిన మిల్లర్లు ధరలో తీవ్రంగా కోత విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గత రెండు రోజులక్రితం వరకు క్వింటాకు రూ.2300 నుంచి రూ.2,350 వరకు కొనుగోలు చేసిన మిల్లర్లు అకాల వర్షాల వార్తలతో రూ.200-300 వరకు ధర తగ్గించి సన్నధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కొన్నిరకాల ధాన్యాన్ని మిల్లర్లు రూ.2000 నుంచి రూ.2100కే కొనుగోలు చేస్తూ రైతును ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సాధారణ చింట్ల రకాలను సైతం రూ.2220 నుంచి రూ.2230 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, కనీస మద్దతు ధర కూడా రైతులకు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహీంద్ర చింట్ల రకాన్ని రూ.2100 నుంచి రూ.2150 వరకు కొనుగోలు చేయగా హెచ్‌ఎంటీ ధాన్యాన్ని క్వింటాకు రూ.2000కే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. గత సీజన్‌లో చింట్ల రకాలకంటే హెచ్‌ఎంటీ రకాన్ని రూ.50 తక్కువకు మాత్రమే కొనుగోలు చేయగా, ఈసారి రూ.300 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

మద్దతు ధరపై కొరవడిన పర్యవేక్షణ

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మద్దతు ధరకు కొనుగోలు చేయని మిల్లుల వద్ద గురువారం రెవెన్యూ సిబ్బందిని నియమించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ మిల్లర్లు తక్కువ ధరకే కొనుగోలు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ధరకంటే మిల్లర్లు తక్కువకు కొనుగోలు చేస్తున్నప్పటికీ అధికారులు ప్రేక్షక పాత్రకే పరిమితమవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.2,320 మద్దతు ధర ప్రకటించినా రూ.2000 నుంచి రూ.2200 వరకు మాత్రం కొనుగోలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిండికేట్‌గా మారిన మిల్లర్లు అధికారుల ఆదేశాలు లెక్కచేయడం లేదంటున్నారు. ధాన్యం నాణ్యతను మిల్లర్లే నిర్ధారించడంవల్ల రైతు ధాన్యాన్ని శాస్త్రీయంగా పరీక్షించి నాణ్యతను నిర్ధారించే అధికారులు అందుబాటులో లేనందున, మిల్లర్లను బతిలాడి విక్రయించాల్సి వస్తుందని అంటున్నారు.

వే బిల్లుపైనే ధాన్యం రేటు

రైతులు మిల్లర్లకు ధాన్యం విక్రయించినప్పటికీ మిల్లు పేరున కాకుండా వేబ్రిడ్జ్ పేరున రశీదులు జారీ చేస్తున్నారు. వేబ్రిడ్జి తూకం బిల్లుపైనే మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసిన

- మిగతా 6వ పేజీలో...



మదర్‌డెయిరీలో అవిశ్వాస సెగ

» ప్రస్తుత చైర్మన్‌ను తొలగించాలనే యోచన » స్థానిక ఎమ్మెల్యేలకు పరేషాన్

యాదాద్రి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (మదర్‌డెయిరీ) రాజకీయాలకు వేదికగా మా రింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ పార్టీ నుంచి ఎన్నికైన చైర్మన్‌పై ఆరునెలలకే అవిశ్వాసానికి తెరదింపడం చర్చనీయాంశం గా మారింది. సొంత పార్టీకి చెందిన డైరెక్టర్లే ప్రస్తుతం ఉన్న చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. రెండురోజుల క్రితం 11 మంది డైరెక్టర్లు రహస్యంగా సమావేశమై, అవిశ్వాసంపై చర్చించా రు. వీరిలో తొమ్మిది మంది కాంగ్రెస్‌కు చెందిన వారు కాగా,ఇద్దరు బీఆర్‌ఎస్ డైరెక్టర్లు ఉన్నారు. అవిశ్వాస అంశంపై ఉమ్మడి నల్లగొండతోపాటు రంగారెడ్డి జిల్లాలోని కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత ఆరునెలలుగా పాల బిల్లులు చెల్లించకపోవడంతోపాటు ఉద్యోగులకు సరిగ్గా జీతభత్యాలు ఇవ్వడంలేదని చైర్మన్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. మదర్ డెయిరీలో మొత్తం 15 మంది డైరెక్టర్లకు మెజార్టీ సభ్యులు ఆలేరు నియోజకవర్గానికి చెందిన వారే ఉన్నారు. అయితే ఈ వ్యవహారం స్థానిక ఎమ్మెల్యేలను పరేషాన్‌కు గురిచేస్తుంది. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పట్టుబట్టి ప్రస్తుతం ఉన్న చైర్మన్‌కు మద్దతు తెలిపారు. అయితే ఆరు నెలలు కాకముందే చైర్మన్‌పై విమర్శలు వ్యక్తం కావడంతోపాటు అవిశ్వాసం వరకు వెళ్లడంతో ఈ వ్యవహారం..

- మిగతా 5వ పేజీలో..

మదర్ డెయిరీ చైర్మన్‌ను మార్చే ప్రసక్తేలేదు : డైరెక్టర్లు

5



గురుకులాల్లో... కోడింగ్ క్లాసులు

» 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు శిక్షణా తరగతులు

» ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి అమలు

» ఏఐ, మెషిన్ లెర్నింగ్, రోబొటిక్స్, ఆన్‌లైన్ టూల్స్‌పై క్లాసులు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గురుకులాల్లో ఇక నుంచి సాంకేతిక విద్య కూడా అందించనున్నారు. మెరుగైన విద్యతో పాటు పోటీ ప్రపంచంలో సాంకేతికతలో వస్తున్న మార్పులు అందించాలనే తలంపుతో టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఇఐఎస్(తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సొసైటీ) కోడింగ్ క్లాసులకు సిద్ధమైంది. ఈ విద్యా సంవత్సరం(2025-26) నుంచే అందించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు తగ్గట్లు సౌకర్యాలు కల్పించనున్నట్లు గురుకుల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-కోదాడ)

ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు రెగ్యులర్ తరగతులతో పాటు కోడింగ్‌పై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఫలితంగా విద్యార్థులు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకుంటూ ఆయా రంగాల్లో రాణిస్తారని భావిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 17,920 మంది విద్యార్థులు కోడింగ్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకోనున్నారు. ప్రాథమికోన్నత స్థాయి నుంచి విద్యార్థులకు కోడింగ్ క్లాసులు నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో 28 గురుకులాలు..

ఐదవ జోన్‌లోని ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు జనగాం జిల్లాలోని 28ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 640 మంది విద్యార్థుల చొప్పున 17,920మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం కోడింగ్ క్లాసులు అందించాలనే నిర్ణయంతో వారందరూ సాంకేతిక విద్యను అందిపుచ్చుకోనున్నారు.

కోడింగ్ అర్థం..


కంప్యూటర్‌గానీ,స్మార్ట్‌ఫోన్‌గానీ వాడుతున్నప్పుడు మనకు తెరపై కనిపించే అప్లికేషన్లు నడిపించేందుకు వెనక చాలా ప్రోగ్రామ్‌లు పనిచేస్తుంటాయి. ఆయా ప్రోగ్రామ్‌లను కంప్యూటర్ ప్రోగ్రామింగ్ భాషలో రాస్తారు.ఇలా రాయడాన్ని కోడింగ్‌అంటారు.ఈ కోడింగ్ ద్వారానే అప్లికేషన్లు, వెబ్‌సైట్లు, సాఫ్ట్‌వేర్ రూపొందివచ్చు. పైథాన్,జావా, హెచ్‌టీఎంఎల్‌వంటి కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లు ఈకోవకు చెందినవేనని నిపుణులు చెబుతున్నారు.

పాఠ్యాంశాలతో పాటు శిక్షణ ..

పోటీ ప్రపంచంలో చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధి(స్కిల్ డెవలప్‌మెంట్) అనేది ప్రస్తుతం కీలకంగా మారింది. కాగా ప్రభుత్వం ప్రస్తుతం తరగతి గదిలో కరిక్యులమ్(పాఠ్యప్రణాళిక), యాక్షన్‌ప్లాన్(కార్యాచరణ ప్రణాళిక), మానిటరింగ్(పర్యవేక్షణ), పెడగోజీ(బోధన)నను

- మిగతా 5వ పేజీలో...

సాంకేతిక మెళకువలు నేర్పటం అభినందనీయం



ఆరో తరగతి నుంచే విద్యార్థులకుసాంకేతిక మెళకువలు నేర్పించాలనే ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. సాధారణంగా గురుకులాల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉంటారు. వారికి ఫోన్లు, కంప్యూటర్‌పై అవగాహన ఉండదు. ప్రభుత్వ నిర్ణయంతో పాఠశాలలోనే సాంకేతికతపై అవగాహన సంపాదించి బయటకు వెళ్తా రు. విద్యార్థులు ఏరంగంలో రాణించాలన్నా ఇప్పుడు స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రధానంగా అ వసరం.అది పాఠశాల స్థాయిలోనే సాధిస్తారు. దీంతో పోటీప్రపంచలో సులభంగా రాణిస్తారు.

- దున్నా వెంకటేశ్వర్లు, గురుకుల ఉపాధ్యాయుడు

జిల్లాలో 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కలెక్టర్ ఇలాత్రిపాఠి

చిట్యాలరూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని కలెక్టర్ ఇలాత్రిపాఠి తెలిపారు. మండలంలోని పెద్దకాపర్తి, వెలిమినేడులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డీసీవో పత్యానాయక్‌లతో కలిసి బుధవారం ప్రారంభించారు. గ్రామాల్లో సన్న ధాన్యం సాగు చేసేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించడంతో రైతులు కూడా సన్నధాన్యాన్ని సాగుచేశారన్నారు. బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు ద్వారా నీరందించడంలో సాగువిస్తీర్ణం పెరిగిందన్నారు. సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందించనున్నట్లు తెలిపారు. ధాన్యం శుద్ధి చేసేందుకు ఆటోమేటిక్ ధాన్యం శుద్ధి యంత్రాలను ఏర్పాటు చేశామని, వాటితో రైతులకు ధాన్యం శుద్ధిలో ఇబ్బందులు ఉండవాన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేస్తుందని, వ్యవసాయాన్ని పండుగలా చేసేందుకు ప్రోత్సహిస్తుందన్నారు.



నిడమనూరులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

నిడమనూరు: గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, ఓపీ, ఏఎన్‌సీ రిజిస్టర్, హైరిస్క్ చార్టుల ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పెచ్చులు ఊడుతున్న భవనాన్ని పరిశీలించడంతో పాటు నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలించారు. ఈనెలాఖరులోగా నిర్మాణ పనులుపూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంత రం తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా తనిఖీ చేసి రేషన్‌కార్డులకు వచ్చిన దరఖాస్తులు, ధరణి పెం డింగ్ సమస్యల గురించి అడిగితెలుసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించి విచారణ పూర్తిచేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, వైద్యాధికారులు అరవింద్, డాక్టర్ రఫి, ఆర్‌ఐలు సందీప్, దాడి రాజిరెడ్డి, జలీల్ పాషా, గంటా సోమయ్య, అనిల్ ఉన్నారు.

రాజీవ్‌యువ వికాసం దరఖాస్తుకు 14 వరకు గడువు

నల్లగొండ టౌన్: రాజీవ్ యువ వికాసం పథకానికి ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలపై బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ పథకం కింద వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలకు 21 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయేతర పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు 21నుంచి 55 సంవత్సరాల వరకు వయస్సున్నవారు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షా 50వేలు వార్షిక ఆదాయం, మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రూ. లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారు ఈ పథకానికి అర్హులన్నారు. మొదటిసారి ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి, మహిళలు, దివ్యాంగులు, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారు, ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

సాగర్ డ్యాం భద్రతను ఎస్పీఎఫ్‌కు అప్పగించాలి

విశాఖ బెటాలియన్‌కు అప్పగించడంపై బీఆర్‌ఎస్ నిరసన

నాగార్జునసాగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రతను ఎస్పీఎఫ్‌కు అప్పగించాలని సాగర్ బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డ్యాం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్ రమేష్‌జీ మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్‌ఎస్ పాలనలో సాగర్ డ్యాం భద్రతను ఎస్పీఎఫ్‌కు అప్పగించారని తెలిపారు. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు రాలేదని, ఇప్పుడు డ్యాం భద్రతను ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ బెటాలియన్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించడం ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏపీ విశాఖకు చెందిన బెటాలియన్ బలగాలు కాపలాగా ఉండటం వల్ల తెలంగాణ అధికారులను రాత్రి సమయంలో డ్యాం పైకి రానివ్వకుండా తమకు ఇష్టానుసారంగా నీటిని కుడికాల్వ ద్వారా తరలిస్తారని ఆరోపించారు. దీనివల్ల తెలంగాణ రైతాంగం ఇబ్బందులు పడుతుందన్నారు. సాగర్ భద్రతను ఎస్పీఎఫ్‌కు అప్పగించాలని లేదంటే బీఆర్‌ఎస్ తరుపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ నాయక్, శేఖరాచారి, రాము, రామస్వామి, రవి, కృష్ణ, హైమద్, తదితరులు పాల్గొన్నారు.



సాగర్ ప్రధాన డ్యాం గేటు వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బుద్ధవనం ముస్తాబు

మే 12న మిస్‌వరల్డ్ పోటీదారుల బస

నేడు పనులు పరిశీలించనున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



బుద్ధవనంలో రంగులు వేసిన కాటేజీ

నాగార్జునసాగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మే 7 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న ప్రపంచ సుందరీమణులు మే నెల 12వ తేదీన అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో బస చేయనున్నారు. బుద్ధపూర్ణిమ రోజువస్తున్న వారి కోసం బుద్ధవనాన్ని ముస్తాబు చేస్తున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీల్లో 140 దేశాలకు చెందిన యువతులు పాల్గొననున్నారు. అందులో ఆసియా దేశాలకు చెందిన 30మంది యువతులు ఉన్నారు. వీరు తెలంగాణ రాష్ట్రం లో ఉన్న పర్యాటక ప్రాంతాల సందర్శనలో భాగంగా మే 12వ తేది బుద్ధపూర్ణిమ రోజున సాగర్‌లో ఉన్న బుద్ధవనం, నాగార్జునకొండను సందర్శించ నున్నారు. బుద్ధవ నంలో రాత్రి బస చేస్తారని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. బుద్ధవనంలో ఉన్న ఆరు కాటేజీలను మరమ్మతులు చేయడానికి పర్యాటకశాఖ రూ.42 లక్షలు కేటాయించింది. దీంతో కాటేజీలకు నూతనంగా రంగులు వేసి కొత్త డోర్లు, ఏసీలు అమరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. బుద్ధవనం లోపల ఉన్న అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, ఎండిన గడ్డి, పిచ్చి మొక్కలను శుభ్రం చేయిస్తున్నారు. 15రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. పనులను పరిశీలించడానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సాగర్‌కు రానున్నారు.

నేడు బస్తీ దవాఖాన ప్రారంభం

నాగార్జునసాగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన బస్తీ దవాఖానను గురువారం ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు బస్తీ దవాఖానా వైద్యాధికారి డాక్టర్ శుభశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, రవి, నగేష్ తదితరులు హాజరుకానున్నట్లు ఆమె తెలిపారు.



సాగర్‌లో ప్రారంభానికి సిద్ధమైన బస్తీ దవాఖాన

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



దేవరకొండలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బాలునాయక్, పార్టీ నాయకులు

దేవరకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు బుధవారం దేవరకొండలో జై బాపు, జై బీం, జై సంవిధాన్ అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. అనంతరం ఏఐసీసీ సభ్యుడు సంజీవ్ ముదిరాజ్‌తో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని, పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 200మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను వారు పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునమాధవరెడ్డి, మాల్ మార్కెట్‌కమిటీ చైర్మన్ అలివేలు, సంజీవరెడ్డి, ఎం.ఎ.సిరాజ్ ఖాన్, ఆలంపల్లి నర్సింహ, వడ్త్య దేవేందర్‌నాయక్, వెంకటయ్యగౌడ్, శిరందాసు కృష్ణయ్య, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, పున్న వెంకటేశ్వర్లు, ఎండి.యూనుస్, కాంగ్రెస్ నాయకులు ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, జాన్‌యాదవ్, మేకల శ్రీనివాస్‌యాదవ్, అరుణ సురేష్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ

వేములపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సంఘం రాష్ట్ర నాయకుడు బొంగర్ల వినోద్ నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1971లో ఎన్ఎస్‌యూఐను స్థాపించారని అన్నారు. కార్యక్రమంలో కోట సుందర్, సంపత్, మహేష్, సాయి, బన్ని, అఖిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు ఘన స్వాగతం

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జై బాబు జై భీమ్ జై సంవిధాన్ పాద యాత్రలో పాల్గొనేందుకు దేవరకొండకు వెళ్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు కొండమల్లేపల్లిలో కాంగ్రెస్ నాయకులు బుధవారం స్వాగతం పలికారు. ఈ కార్యక్ర మంలో ఉట్కూరి వేమన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, గడ్డం శ్రీరాములు, రవినాయక్, స్వామి, సందీశ్వర్ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించరూ

● కృష్ణపట్టెలో ప్రతి సీజన్‌లో 2వేల ఎకరాలకు పైగా వరి సాగు ● మిల్లులకు రవాణా కోసం రూ.వేలు వెచ్చిస్తున్నరైతులు

కృష్ణానదికి ఆనుకొని ఉన్న పలు తండాలు, గ్రామాల్లో వేలాది ఎకరాల్లో వరి సాగు చేస్తు న్నప్పటికీ ఈ ప్రాంత రైతులకు మార్కెటింగ్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించడం లేదు. దీంతో కృష్ణపట్టె రైతాంగం తాము పండించిన ధాన్యానికి మద్దతు ధర పొందలేక నానా అవస్థలు పడుతున్నారు. పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

- (ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి(సాగర్)



తిరుమలగిరి(సాగర్) మండలం నుంచి రైస్ మిల్లులకు ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతులు

కృష్ణపట్టెలో సుమారు ఎనిమిదేండ్లుగా ఇక్కడి రైతాంగం వరి పంట సాగు పైన ఆసక్తి కనబరుస్తున్నారు. సాగులో మంచి దిగుబడులు సాధిస్తున్నారు. అయితే వారు పండించిన పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. తలాపున కృష్ణానది పారుతుండడం, సాగర్ వెనుక జలాలు తమ పొలాలకు ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రాంత రైతులు వరిని సాగు చేస్తున్నారు. ఇదే క్రమంలో నదికి సుమారు కిలో మీటర్ దూరంలో తమ వ్యవసాయ పొలాలు ఉన్నప్పటికి సొంతంగా లక్ష లాది రూపాయలు వెచ్చించి నది సమీపంలో విద్యుత్ మోటార్లను, నీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేసుకోని స్వయం కృషితో తమ పొలాలకు కృష్ణా జలాలను పారించుకుంటున్నారు. మండలంలోని చింతలపా లెం, నాయకునితండా, నాగార్జునపేటతండా, జమ్మనకోట, తిమ్మాయిపాలెం, సపావత్‌తండాతోపాటు సమీపంలోనే గల అడవిదేవులపల్లి మండలానికి చెందిన జాలకోటితండా, సారెగూడెం, నడిగడ్డ తదితర గ్రామాల్లో కలిపి సుమారు 2వేల ఎకరాలకు పైగా ఈ ప్రాంత రైతులు వరిని సాగు చేస్తున్నారు. తద్వారా ఎకరానికి సుమారు 40 బస్తాల చొప్పున ప్రతి సీజన్‌కు సుమారు 2వేల ఎకరాలకు రమారమి 40 నుంచి 50వేల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి సాధిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధర చొప్పున లెక్కిస్తే సుమారు. రూ.10కోట్ల విలువైన ధాన్యాన్ని పండిస్తున్నారు.

మార్కెటింగ్ లేక రైతుల అవస్థలు

సుమారు 40నుంచి 50వేల క్వింటాళ్ల ధాన్యాన్ని పండిస్తున్నప్పటికీ కృష్ణపట్టె ప్రాంతంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుంది. దీంతో పంటను అమ్ముకోవడానికి ఇక్కడి రైతులు హాలియా, మిర్యాలగూడలోని రైస్ మిల్లుల వద్దకు ధాన్యాన్ని ట్రాక్టర్లపై తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఒక్కో ట్రాక్టర్ లోడ్‌కు కిరాయి కోసం సుమారు రూ.5 నుంచి రూ.6వేల ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళా రైస్ మిల్లుల వద్ద పెద్ద ఎత్తున ట్రాక్టర్ల క్యూలైన్లు ఉండి రెండు, మూడు రోజుల వరకు ధాన్యం దిగుమతి కాకుంటే ట్రాక్టర్ల కిరాయి తడిసి మోపెడు ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి కృష్ణపట్టె రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు వీలుగా కొనుగోలు కేంద్రాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిందిగా ఇక్కడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.


మద్దతు ధర పొందలేకపోతున్నాం



కృష్ణపట్టె ప్రాంతంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడంతో రైస్ మిల్లు ల వద్దకు వెళ్లి వారు చెప్పిన రేటుకు అమ్ముకోవాల్సి వ స్తుంది. దాంతోపాటు ప్రభుత్వం రైతులకు ఇస్తున్న కనీస మద్దతు ధర, బోనస్‌ను కూడా పొందలేకపోతున్నాం.

- వరదపాక రాజాలు (రైతు, చింతలపాలెం)

మిర్యాలగూడ, హాలియా మిల్లులకు వెళ్లాల్సి వస్తోంది



మిర్యాలగూడ, హాలియా మిల్లులకు వెళ్లి ధాన్యం విక్రయించాల్సి వస్తోంది. ఐదేళ్లుగా నాకున్న రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. కానీ మా ప్రాంతంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు మి ర్యాలగూడ, హాలియా మిల్లులకు వెళ్లి ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. దీనివల్ల ట్రాక్టర్ కిరాయిలకే ఎక్కువ ఖర్చు వస్తుంది. అధికారులు ఈ సీజన్‌లో కొనుగోలు కేంద్రాన్ని మా ప్రాంతంలో ప్రారంభించాలి.

- జర్పుల హేమ(రైతు, నాయకునితండా)

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

కృష్ణపట్టె ప్రాంతంలో పండిస్తున్న ధాన్యం వివరాలు తెలుసుకుంటా. ఆ ప్రాంతంలో పనిచేస్తున్న మహిళా సమ భావన సంఘాలు, కేంద్రం ఏర్పాటుకు అవసరమైన సౌకర్యాల గురించి స్థానిక ఐకేపీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

- శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో

పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి



మిర్యాలగూడలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండలంలోని జప్తివీరప్పగూడెం, ఉట్లపల్లి, యాద్గార్‌పల్లి, బాదలాపురం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కన్నెకంటి రామకృష్ణ, ఉన్నం వెంకటేశ్వర్లు, వస్కుల సూర్యం, సీతారాములు, నీరజ, నాగరాజు, నాగహుస్సేన్, వెంకన్న, నరేష్ పాల్గొన్నారు

● దేవరకొండ : కేంద్రప్రభుత్వం గ్యాస్ పై పెంచిన రూ. 50 వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. దేవరకొండలో సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మహిళలతో కలిసి గ్యాస్ సిలిండర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని బస్టాండ్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం గ్యాస్‌తో పాటు నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి పేదలపై పెనుభారం మోపుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, నాయకులు పోలే వెంకటయ్య, నూనె రామస్వామి, అంజనేయులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దేవరకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని కొమ్మేపల్లిలో రాష్ట్ర ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ ఆధ్వర్యంలో రైతు లకు మంజూరైన సూక్ష్మసేద్య పరికరాలను(స్ప్రింక్లర్లు)బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న సూక్ష్మసేద్య పరికరాలను సద్వినియోగం చేసుకొని అధిక పంట దిగుబడి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి, ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

మాడ్గులపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబా అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న పెండింగ్ బూత్ కమిటీలను పూర్తి చేయాలన్నారు. ఈ నెల 14 నుంచి 23 వరకు అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, జిల్లా పార్టీ కౌన్సిల్ సభ్యుడు బొమ్మకంటి నరసింహ, నాయకులు కడియం సైదులు, పాల్గొన్నారు.

కూలీలు సమయపాలన పాటించాలి



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కార్యదర్శి శ్రవణ్‌కుమార్

వేములపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం పనులకు హాజరవుతున్న కూలీలు సమయపాలన పాటించాలని పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలో బుధవారం జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున కూలీలు ప్రదేశాలకు ఉదయం 7గంటలకు చేరుకొని మధ్యాహ్నం 12 గంటల వరకు పనులు ఉండేలా చూడాలన్నారు. నంతరం కూలీలను ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన వెంట ఎఫ్ఏ తులసి, సీనియర్ మేటు ఆశాబేగం, వెంకన్న, వెంకట్‌రెడ్డి, వినోద, పర్వీన్, ఉమా, మౌనిక, పూజిత, పద్మ ఉన్నారు.

రాజేశ్వర్‌రావు ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ నేత దివంగత చండ్ర రాజేశ్వర్‌రావు ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. స్థానిక చండ్ర రాజేశ్వర్‌రావు 31వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, పోలే వెంకటయ్య, నూనె రామ స్వామి, జూలూరి వెంకట్రాములు, వలమాల ఆంజనేయులు పాల్గొన్నారు.

సారూ.. 'మద్దతు' ఇప్పించరూ!


(3వ పేజీ తరువాయి)

ఖరీదును వేసి రైతులకు ఇస్తున్నారు. దీంతో తక్కువ ధరకు కొనుగోలు చేసిన మిల్లర్‌పేరు బయటికి రాకుండా జాగ్రత్త పడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ధాన్యం ధరల్లో కోత

మిర్యాలగూడ రూరల్: మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులను ముంచుతున్నారు. మిల్లర్లతో జిల్లా అధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసినా వారి తీరు మారడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడలోని యాద్గార్‌పల్లి, గూడూరు, వెంకటాద్రిపాలెం, తుంగపాడు గ్రామాలతోపాటు పట్టణంలో ఉన్న 150 మిల్లుల్లో సగానికిపైగా మిల్లుల్లో నామమాత్రంగా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా రైస్‌మిల్లులు కలిగి ఉన్న మిర్యాలగూడకు పెద్దవూర, హాలియా, త్రిపురారం, తిప్పర్తి, మాడ్గులపల్లి, వేములపల్లి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, కోదాడ, మేళ్లచెర్వు, జాన్‌పహాడ్, దామరచర్ల ప్రాంతాలనుంచి అత్యధికంగా ధాన్యం విక్రయించేందుకు రైతులు ధాన్యం లోడ్‌లను తెస్తున్నారు. రైతులు ఒకే సమయంలో ధాన్యం కోతలు ప్రారంభించడంతో మిల్లర్లు తమదైన శైలిలో ధాన్యం కొనుగోలు చేపడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. రూ.2,450నుంచి ధర పలికిన ధాన్యానికి కేవలం రూ.2వేలు, రూ.2100కు కొనుగోలు చేస్తున్నట్లు తెలుపుతున్నారు. మిల్‌పాయింట్లకు తెచ్చిన ధాన్యాన్ని వెనక్కి తీసుకెళ్లలేని రైతులు మిల్లర్లు చెప్పిన ధరకే విక్రయిస్తూ నష్టపోతున్నారు. రైతుల దయనీయ పరిస్థితులపై అధికారులు సైతం మిల్లర్లను ఆదేశించే పరిస్థితులు కనపడడం లేదని, సిండికేట్‌గా మారిన మిల్లర్ల వైఖరి రైతులకు తీవ్ర నష్టం కలిగేలా ఉందని వాపోతున్నారు. దీనికి తోడుగా ధాన్యం అధిక స్థాయిలో మిల్ పాయింట్లకు చేరుకున్న సందర్భంగా కొన్ని మిల్లులు ధాన్యం కొనుగోళ్లను నిలిపివేస్తూ సిండికేట్‌గా మారిన వారు మాత్రమే కొనుగోలు చేపట్టేలా తమ వ్యవహారాన్ని సాగిస్తున్నట్లు తెలుస్తుంది.

చింట్లు రూ.2100కే విక్రయించా



చింట్ల రకాన్ని ధాన్యం మిల్లు వద్దకు తెచ్చా. క్వింటా రూ.2100కే కొనుగోలు చేశారు. అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే ఎవరు ఎక్కడున్నారో తెలియలేదు. పర్యవేక్షణాధికారి ఫోన్ నెంబరు, వివరాలు తెలియదు. ఎక్కడ ఫిర్యాదు చేయాలో కూడా వివరాలు ప్రకటించలేదు. మిల్లర్ చెప్పిన ధరకే ధాన్యం విక్రయించాల్సి వచ్చింది.

- రావు మట్టారెడ్డి, రైతు, పాములపాడు, మాడ్గులపల్లి మండలం

ఫిర్యాదులు అందలేదు

ఉదయంనుంచి అన్ని మిల్లుల వద్ద రెవెన్యూ అధికారులను పర్యవేక్షణకు ఏర్పాటు చేశాం. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. మిల్లుల్లో మద్దతు ధర రాకుంటే రైతులు బోనస్‌ను వినియోగించుకునేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి.

జావీద్, డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లయ్

సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే



నిడమనూరు మండలం తుమ్మడంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నిడమనూరు, పెద్దవూర, గుర్రంపోడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పేదోడి సొంతింటి కల సాకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నిడమనూరు మండలం తుమ్మడం, త్రిపురారం మండలం కంపాలపల్లి, పెద్దవూర మండలం కొత్తలూరు గుర్రంపోడు మండలం జూనూతల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇంటిని కూడా నిర్మించిన పాపాన పోలేదని, డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేసిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే పేదలకు ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నా రు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. నిడమ నూరు తుమ్మడం గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేయడానికి దివంగత రంగశాయిరెడ్డి కారణమన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ప్రైమరీ హెల్త్ సబ్ సెంటర్‌కు రంగశాయిరెడ్డి పేరు పెడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఎంపీడీవో బోనగిరి రమేష్, ఎంపీవో కేథార్‌నాథ్, కార్యదర్శి గంగుల లింగయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, నాయకులు కర్నాటి లింగారెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, నందికొండ మట్టారెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, నూకల వెంకట్‌రెడ్డి, నర్సింగు విజయ్, మంజుల శ్రీనివాస్, గంగుల శ్రీను, బుర్రి వెంకన్న, కోటమ్మ పాల్గొన్నారు. అలాగే తమ్మడపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన గుంటుక సోమిరెడ్డిని ఎమ్మెల్యే జై వీర్‌రెడ్డి పరామర్శించారు. పెద్దవూర మం డలం కొత్తలూరులో జడ్పీ మాజీ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎస్ఏ. రాజ్‌కుమార్, ఎంపీడీవో సంపత్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, కొత్తలూరు మాజీ సర్పంచ్ నులక రమణారెడ్డి, రవీందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి ఉన్నారు. కాగా, గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల వెంకటేశ్వర్ రెడ్డి, కంచర్ల విజేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చనమల్ల యాదవరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తగుళ్ల సర్వ య్య, జాలచినస త్తయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

మాడ్గులపల్లి, : మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన తంగెళ్ల సంపత్‌రెడ్డి అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. దీంతోయూత్ కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు మోహన్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతడికి రూ. 60వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారుడికి అందజేశారు.

పరామర్శ

హాలియా :అనుముల గ్రామానికి చెందిన మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి సమీప బంధువు గోలి లక్ష్మారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు చింతల చంద్రారెడ్డి, పిల్లి ఆంజనేయులు, ప్రసాద్‌నాయక్, ఉన్నారు.

ఆర్థిక సాయం

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్రపుతండాకు చెందిన రమావత్ కుమార్- కలమ్మ, రమావత్ సుబ్బు-చిట్టి దంపతులు ఇటీవల ఆడపిల్లలు జన్మించారు. దీంతో అదే తండాకు సేవానాయక్ గతంలో ప్రకటించిన విధంగా బంగారు తల్లి కానుకగా రూ. 2,016 చొప్పున బుధవారం అందజేశారు.

ప్రాణాలకు తెగించి.. ఆవును రక్షించి..

హాలియా, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీలోని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన ఆడెపు రాజయ్య ఆవు గడ్డి మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన రాజయ్య ఆవును కాపాడుకునేందుకు తడి వరి మడిలో నిలబడి కర్రసాయంతో వైర్లను పక్కకు తొలగించి ఆవును రక్షించాడు. అటుగా వెళున్న గ్రామస్థులు వీడియో తీయడంతో సోషల్‌మీడియాలో వైరల్ అయింది.



విద్యుత్ తీగలను తొలగిస్తున్న రైతులు

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు , నోముల భగత్



మిర్యాలగూడలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, హాలియా ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, నోముల కోరారు. మిర్యాలగూడ, హాలియాల్లో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్యనాయకుల విస్తృతస్థాయి సమావేశాల్లో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భావించి 25 ఏళ్ల అవుతున్నందున వరంగల్ జిల్లా ఎల్కతుర్తి క్రాస్‌రోడ్ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గం నుంచి కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రతి వాహనంలో వాటర్‌క్యాన్లు ఏర్పాటు చేసుకుని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు ఉదయం 9 గంటలకే బయల్దేరాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎండీ మోసిన్‌అలీ, బైరం సంపత్, చిట్టిబాబు నాయక్, నాగార్జునచారి, జోన్నలగడ్డ రంగారెడ్డి, ఎండీ యూసూఫ్, వీరకోటిరెడ్డి, ముక్దుమ్‌పాషా, మట్టపల్లి సైదయ్య, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పాలుట్ల బాబయ్య, చిర్ర మల్లయ్య పాల్గొన్నారు.హాలియాలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, తాటి సత్య పాల్, నాగులవంచ తిరుపతిరావు, వడ్డె సతీష్‌రెడ్డి, యడవల్లి మహే ందర్‌రెడ్డి, నల్లగొండ సుధాకర్, బొల్లం రవి పాల్గొన్నారు.హాలియాలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, తాటి సత్య పాల్, నాగులవంచ తిరుపతిరావు, వడ్డె సతీష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



హాలియాలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

ఉట్లపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన మండలంలోని ఉట్లపల్లి పంచాయతీ కార్యదర్శి పెసర యాదగిరిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే గ్రామపంచాయతీ విధుల్లో భాగంగా గ్రామానికి చెందిన రజియా, ఇరుగు దిండ్ల లక్ష్మమ్మలకు చెందిన నివాస గృహాల మ్యూటేషన్ అమలులో సరైన ధృవపత్రాలు, ఆధారాలు లేకుండా 30/12/202 సంవత్సరానికి సంబంధించిన రివిజన్ రిజిస్టర్‌లో మార్పులు చేసిన ఘటనపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి అధికారులు అతడిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

నర్ర రాఘవరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

వేములపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సాధనే లక్ష్యంగా నిరంతరం పోరాడిన మాజీ ఎమ్మెల్యే నర్ర రాఘవరెడ్డి ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నర్ర రాఘవరెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో వడ్డెగాని సైదులు, ఎలగబోయిన నాగయ్య, పరుశురాములు, మట్టయ్య, భూలక్ష్మమ్మ, జానకమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

● దామరచర్ల : వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానికని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవి దృష్ట్యా మోటార్లను అద నంగా సమకూర్చుకోవాలని సూచిచారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, కార్య దర్శులు ఉన్నారు.

● వేములపల్లి : తనపై తప్పుడు కేసులు బనాయిస్తానంటున్న వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని మాడ్గులపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన నామిరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్.29లో గల 16 గుంటల భూమి ఉండగా మమ్మల్ని బెదిరించి కొందరు 12గుంటల భూములను ఆక్రమించారని మరో 4గుంటల భూమిని భూమికి ఇరువైపులా ఉన్న రైతులు సైతం ఆక్రమించేందుకు పూనుకున్నారని పేర్కొన్నారు. సదరు భూమిలో రెండు టేక్ చెట్లను, రెండు సుబాబుల్ చెట్లను నరికి అమ్ముకున్నారని అన్నారు. ఈ విషయమై స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ సాయం చేయక పోగా వారికి సహకరించినట్లు ఆయన ఆరోపి ంచారు. ఈ విషయంపై ఎస్ఐను వివరణ కోరగా శ్రీధర్‌రెడ్డి తండ్రి గ్రామంలోని భూమిని కొందరు రైతులకు సాదాబైనామాల విక్రయించారని, అతడి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేయగా కొనుగోలుదారులు కబ్జాలో ఉన్నారని తేలిందన్నారు. దీంతో శ్రీధర్‌రెడ్డికి తాను సహకరించలేదని తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

● మాడ్గులపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు.కార్యక్రమంలో దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, జూకూరు నాగయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : 2012లో చేసిన పోక్సో చట్టం ద్వారా 18 ఏండ్లలోపు ఆడపిల్లలకు లైంగిక వేదింపులు, అత్యాచారాల నుంచి రక్షణ లభిస్తుందని అరోరా న్యాయ కళాశాల విద్యార్థినిలు బండి అశ్విని, దుర్గాభవానిలు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో వారు పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రవణ్‌కుమార్‌రెడ్డి, అన్వేష్, మోహనకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

● హాలియా, వేములపల్లి : పోషణ పక్వాడలో భాగంగా అనుముల మండలం రామడుగు, వేములపల్లి మండలం ఆమనగల్లు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మాడ్గులపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డి సూచించారు.మండలంలోని ఆగామోత్కూర్, పాములపాడు, చిరుమర్తి, గుర్రప్పగూడెం గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని తేమ 17శాతం కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. రైతు లు నాణ్యమైన ధాన్యాన్ని తరలించినట్లయితే ప్రభుత్వ గరిష్ట మద్దతు ధర రూ.2,320, సాధారణ రకం ధాన్యానికి రూ.2300తోపాటు సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బాషపాక చంద్రశేఖర్, సీసీ నాగయ్య, వీవో అధ్యక్షురాలు రేణుక, రైతులు పాల్గొన్నారు.



ఆగామోత్కూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి